

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

## 26 నుంచి 30 వరకు అంకమ్మ తల్లి తిరునాళ్ల మహోత్సవాలు



**విడవలూరు, జూలై 15 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని శ్రీ అంకమ్మ తల్లి ఆలయంలో ఈనెల 26వ తేదీ నుంచి 30వ తేదీ వరకు తిరునాళ్ల మహోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు కొర్నాగిరి తెలిపారు. మహోత్సవాల్లో భాగంగా ఈనెల 26న బియ్యపు కోల, పోలంగి సేవ, 27న కోర్లు, 28న పరుపుపళ్లెం, 29న విశేష పూజలు, 30న పారువేట ఉత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే ప్రతి రోజు భక్తుల కోసం సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తిరునాళ్లలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి దర్శనం చేసుకుని ఆశీస్సులు పొందాలని ఆలయ అర్చకులు, సేవకులు కోరారు.

## 17న ఉద్యోగుల ప్రత్యేక గ్రీవెన్స్ : కలెక్టర్



**నెల్లూరు, జులై 15, ప్రభతవార్త – కలెక్టరేట్** 16వ తేదీ (గురువారం) నిర్వహించాల్సిన ఉద్యోగుల ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమాన్ని పల్లె వీక్షణ కార్యక్రమం కారణంగా 17వ తేదీ (శుక్రవారం)కు వాయిదావేశామని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని ఉద్యోగులందరూ గమనించి ఈనెల 17వ తేదీన ఉదయం 11 గంటలకు తిక్కన ప్రాంగణంలో జరిగే ఉద్యోగుల ప్రత్యేక గ్రీవెన్స్‌లో తమ సమస్యలను తెలియజేయ వచ్చునన్నారు.

## జగన్‌కు విజన్ లేదు: మంత్రి నారాయణ



**నెల్లూరు, జూలై 15, ప్రభాతవార్త – వైద్యం:** ఆంధ్రప్రదేశ్‌ను చెత్తరహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టిందని, గత ప్రభుత్వం వదిలివెళ్లిన లెగసీ వ్యర్థాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతున్నామని పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అన్నారు. నెల్లూరు రూరల్ మండలంలోని దొంతాళి డంపింగ్ యార్డును బుధవారం పరిశీలించిన ఆయన, అక్కడ నిర్మాణంలో ఉన్న ఘన వ్యర్థాల ప్రాసెసింగ్ ప్లాంట్ పనులను పర్యవేక్షించారు. పనులు శరవేగంగా సాగుతుండటంపై సంతృప్తి వ్యక్తం చేస్తూ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం ఘన వ్యర్థాల నిర్వహణను పూర్తిగా నిర్లక్ష్యం చేసి ప్రజలపై చెత్త పన్ను భారం మోపడంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా 153 లక్షల టన్నుల లెగసీ చెత్తను వదిలి వెళ్లిందని విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండేళ్లలో 130 లక్షల టన్నుల చెత్తను తొలగించిందని, మరో 23 లక్షల టన్నుల వ్యర్థాల ప్రాసెసింగ్ కొనసాగుతోందని తెలిపారు. జూలై నెలాఖరుకల్లా రాష్ట్రంలో పేరుకుపోయిన లెగసీ చెత్తను పూర్తిగా తొలగిస్తామని స్పష్టం చేశారు. గుంటూరు, విశాఖపట్నంలోని వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లలో రోజుకు 2,800 టన్నుల చెత్తను శుద్ధి చేసి విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నామని మంత్రి తెలిపారు. 2014లో మంజూరైన వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లను గత పాలకులు రద్దు చేయడం వల్ల రాష్ట్రానికి తీవ్ర నష్టం జరిగిందన్నారు. ఆ ప్లాంట్లు పూర్తయి ఉంటే రాష్ట్రవ్యాప్తంగా ప్రతిరోజూ ఉత్పత్తి అయ్యే 7 వేల టన్నుల చెత్తను అదే రోజు శుద్ధి చేసే అవకాశం ఉండేదని పేర్కొన్నారు. అవగాహన, దూరదృష్టి లేకపోవడంతోనే గత ప్రభుత్వం ఆ ప్రాజెక్టులను గాలికి వదిలేసిందని విమర్శించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో మరో ఆరు వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ల ఏర్పాటుకు అనుమతులు మంజూరయ్యాయని, వాటి పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 107 ఘన వ్యర్థాల ప్రాసెసింగ్ ప్లాంట్ల నిర్మాణం జరుగుతోందని, పూర్తయిన ప్రాసెసింగ్ ప్లాంట్లను ఈ నెల 18న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. దొంతాళి డంపింగ్ యార్డులో లెగసీ వ్యర్థాలను ఈ నెలాఖరుకల్లా పూర్తిగా ప్రాసెస్ చేసి తొలగిస్తామని మంత్రి చెప్పారు. ఇదే ప్రాంతంలో జిందాల్ కంపెనీ ఆధ్వర్యంలో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నామని, రెండేళ్లలో నిర్మాణాన్ని పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. ఆ ప్లాంట్ ప్రారంభమైన తర్వాత 100 కిలోమీటర్ల పరిధిలోని మున్సిపాలిటీల నుంచి వచ్చే చెత్తను రోజువారీగా శుద్ధి చేసి విద్యుత్ ఉత్పత్తికి వినియోగిస్తామని వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజన్‌తోనే ప్రజారోగ్య పరిరక్షణకు పెద్దపీట వేస్తూ రాష్ట్రాన్ని పరిశుభ్రమైన, చెత్తరహిత ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి నారాయణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ సీఈ వేణుగోపాల్, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ మహేష్, అదనపు కమిషనర్ హిమబిందు, ఎస్ఈ జానీ, జిందాల్ కంపెనీ జనరల్ మేనేజర్ రామకృష్ణ, జిగ్మా కంపెనీ ప్రతినిధులు, టీడీపీ నేత దొడ్డపనేని రాజానాయుడు తదితరులు పాల్గొన్నారు.

## రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ పేరిట రాష్ట్రంలో వైస్సార్సీపీ కొత్త డ్రామా

**- టీడీపీ నెల్లూరు జిల్లా అధ్యక్షులు బీద రవిచంద్ర**



**నెల్లూరు, జూలై 15, ప్రభాతవార్త – వైద్యం:** రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ పేరిట రాష్ట్రంలో కొత్త డ్రామాను వైస్సార్సీపీ మొదలెట్టిందని శాసన మండలి సభ్యులు, టీడీపీ నెల్లూరు జిల్లా అధ్యక్షులు బీద రవిచంద్ర ఎద్దేవా చేశారు. బుధవారం ఆయన నెల్లూరు నగరంలోని తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌ను ప్రారంభించింది, నిలిపివేసింది, 3 ఏళ్ళు పట్టించుకోనిది, వెయ్యి కోట్లు దోచేసింది జగన్మోహన్ రెడ్డి అని ఆరోపించారు. భారతదేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందబోతున్న రాయలసీమను చూసి వైస్సార్సీపీ డైవర్షన్ రాజకీయాలు మొదలు పెట్టిందన్నారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌కు ఎలాంటి అనుమతులు లేవని తెలిసినా వెయ్యి కోట్ల మట్టి పనులు చేసి దోచుకున్న ఘనత జగన్మోహన్ రెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డిలది అన్నారు. రాయలసీమ ఇరిగేషన్ అభివృద్ధి పై ఓపెన్ ఛాలెంజ్ విసురుతున్నామని, కూటమి ప్రభుత్వంలో గత 2 ఏళ్లలో 12 వేల 484 కోట్లు ఖర్చు పెట్టామని, రానున్న 3 ఏళ్లలో 10 వేల కోట్లు ఖర్చు పెట్ట బోతున్నామని పేర్కొన్నారు. 5 ఏళ్ల వైస్సార్సీపీ పాలనలో ప్రకటించిన 12 లక్షల కోట్ల బడ్జెట్‌లో రాయలసీమ ఇరిగేషన్ ప్రాజెక్ట్ లకు జగన్మోహన్ రెడ్డి కేటాయించింది కేవలం 2 వేల కోట్లు మాత్రమే అన్నారు. అయితే టీడీపీ ప్రభుత్వంతో పోల్చితే పదో వంతు కూడా ఖర్చు చేయని మీరా మమ్మల్ని విమర్శించేదని ప్రశ్నించారు.

పట్టిసీమ, వట్టిసీమ అని తాను అధికారంలోకి వస్తే పట్టిసీమను మూసేస్తానని చెప్పిన జగన్మోహన్ రెడ్డికి పట్టిసీమ బటన్ నొక్కక తప్పలేదన్నారు. సోమశిల గేటుకు వైసీపీ ప్రభుత్వం లో ఒక డబ్బా పెయింట్ వేశారా? కనీసం గేటుకు ఉన్న తుప్పు ఏనాడైనా తుడిచారా? సోమశిల ప్రాజెక్ట్‌ను 5 ఏళ్ళు గాలికి ఒదిలేసిన వైసీపీ నేతలు, మేం పనులు మొదలెడుతుంటే హడావుడి చేస్తున్నారన్నారు. 5 ఏళ్ల పాలనలో గేట్ల మరమ్మత్తులకు నిధులు ఇవ్వలేకపోయిన జగన్మోహన్ రెడ్డికి తెలుగుదేశం పార్టీ ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు ఉందా? అన్నారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌కు టెక్నికల్, అడ్మినిస్ట్రేషన్ అనుమతులు ఇచ్చింది 2020 జూన్, జులైలో, నిలిపివేసింది. 2021 జులైలో, మరో మూడేళ్లపాటు వైస్సార్సీపీ ప్రభుత్వం కొనసాగినా అనుమతులు రాకపోతే ఏ మాత్రం సంబంధం లేని తెలుగుదేశం పార్టీ ప్రాజెక్ట్‌ను అడ్డుకుందని వైస్సార్సీపీ దుష్ప్రచారం చేస్తోందన్నారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ తాగునీటి ప్రాజెక్ట్ మాత్రమే నని జీవో తెచ్చుకున్నది వైస్సార్సీపీ ప్రభుత్వమే అని తెలిపారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ ప్రాజెక్ట్ అనుమతులను మూడేళ్ళ పట్టించుకోకుండా వదిలేసిన పార్టీ వైస్సార్సీపీ అని, పెనాల్టీలు కట్టిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అన్నారు. రాయలసీమ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌ల కోసం ఒక ఏడాదిలో చంద్రబాబు పెట్టిన ఖర్చు ను 5 ఏళ్ల వైసీపీ పాలనలో జగన్మోహన్ రెడ్డి ఖర్చు చేయలేకపోయారన్నారు. 35313 కోట్ల నిధులతో 36 ప్రాజెక్ట్ లను మూడేళ్లలో పూర్తి చేసేందుకు ఇరిగేషన్ కేలండర్ ద్వారా స్పష్టమైన ప్రణాళిక ఇచ్చామని, 5 ఏళ్ల వైస్సార్సీపీ పాలనలో ఇరిగేషన్ అభివృద్ధి ని జగన్మోహన్ రెడ్డి గాలికి వదిలేశారన్నారు. 5 ఏళ్ల పాలనలో అదనంగా ఒక్క ఎకరాకు నీరు ఇవ్వని జగన్మోహన్ రెడ్డి, 3870 కోట్లు వెచ్చించి హంద్రీనీవా ని 2 ఏళ్లలో 1700 నుంచి 3500 క్యూ సెక్కులకు పెంచి చిట్టచివరి ఎకరాకు నీరు అందించిన చంద్రబాబును విమర్శించడమా? అని ప్రశ్నించారు. పులివెందులకు కృష్ణా జలాలను తరలించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, 5 ఏళ్ల పాలనలో పులివెందులకు తాగు, సాగు నీరు ప్రాజెక్ట్‌లను సైతం జగన్మోహన్ రెడ్డి. పూర్తి చేయలేకపోయారన్నారు. రాష్ట్రాన్ని వదిలేద్దాం, రాయలసీమను వదిలేద్దాం, సొంత కడప జిల్లాను వదిలేద్దాం, కనీసం పులివెందులకైనా వెయ్యి ఎకరాలకు అదనంగా నీరు ఇచ్చారా? కనీసం తాగునీటి ప్రాజెక్ట్ అయినా పూర్తి చేశారా జగన్మోహన్ రెడ్డి అని ప్రశ్నించారు. కడతామని చెప్పిన రాజోలు రిజర్వాయర్ కట్టారా..? గండికోట నిర్వాసితులకు 10 లక్షలు ఇచ్చారా..? కడపలో స్టీల్ ప్లాంట్ కడితేనే 2024లో ఓట్లు అడుగుతానని చెప్పిన జగన్మోహన్ రెడ్డి మాట మీద నిలబడ్డారా? మీ తండ్రి రాజశేఖర్ రెడ్డి, ఆత్మీయ సోదరుడు గాలి జనార్ధన రెడ్డి, మరోసారి మీరు శంఖుస్థాపనలు చేశారన్నారు. విగ్రహాలు కట్టారు, మరి 5 ఏళ్లలో స్టీల్ ప్లాంట్ ఎందుకు కట్టలేక పోయారు? నేడు స్టీల్ ప్లాంట్ కడుతున్నది చంద్రబాబు, కూటమి ప్రభుత్వం అని స్పష్టం చేశారు. పట్టిసీమ 29/03/2015లో ప్రారంభం కాగా 28/03/2016కి పూర్తి చేశారు. ఆరు నెలల (18/09/2015) తర్వాత తొలిసారిగా మోటారు ప్రారంభం అయిందన్నారు. 10 ఏళ్లలో 442 టీఎంసీ లు వినియోగించుకున్నాం. 44 వేల కోట్ల రూపాయల రెవెన్యూ ఏర్పడిందన్నారు. పట్టి సీమ వృధా అని, తాను అధికారంలోకి వస్తే మూసేస్తానని చెప్పిన జగన్మోహన్ రెడ్డికి పట్టి సీమ బటన్ నొక్కక తప్పలేదన్నారు. చివరికి పట్టి సీమయే దిక్కయిందన్నారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ను ఆపింది మేమేనని హరీష్ రావు 2021 లో ప్రకటించారని గుర్తు చేశారు. అనుమతులు రావని తెలిసీ అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వెయ్యి కోట్ల రూపాయలు పనులు చేసి దోచుకున్నారని ఆరోపించారు. రాయలసీమ అంటే వెనుకబాటుతనం, ఫ్యాక్షనిజం, తాగు, సాగు నీరు లేనటువంటి ప్రాంతంగా గుర్తించే పరిస్థితిని మార్చిన ఘనుడు సిఎం నారా చంద్రబాబు నాయుడు అన్నారు. రాయలసీమ నుండి ఎంతమంది పాలకులు పాలించినా, ఆనాడు ఎన్టీఆర్, ఈనాడు చంద్రబాబు చేసిన ప్రయత్నాలతోనే రాయలసీమ అభివృద్ధి పుంజుకుందన్నారు. రాయలసీమలోని అతికొద్ది వనరులతో వ్యవసాయ, హార్టీ కల్చర్‌ను చంద్రబాబు ఏ విధంగా ప్రమోట్ చేశారో, సాగు, తాగునీటి రంగాలను ఏ స్థాయిలో అభివృద్ధి చేశారో రాష్ట్ర ప్రజలు చూశారన్నారు. రాయలసీమను రతనాల సీమగా మార్చేందుకు ఆనాడు ఎన్టీఆర్ గాలేరు – నగరి, హంద్రీనీవా, తెలుగుగంగ పథకాలకు శ్రీకారం చుట్టారు. వాటి అభివృద్ధి పనులను చంద్రబాబు కొనసాగించారని తెలిపారు. లక్ష కోట్ల పెట్టుబడులతో ప్రపంచంలోనే అత్యుత్తమైన హార్టీ కల్చర్ హబ్‌గా, పరిశ్రమలకు మోడల్‌గా రాయలసీమను చంద్రబాబు తీర్చిదిద్దుతున్నారన్నారు. భారతదేశంలోని పెట్టుబడుల్లో 25 శాతం పైగా ఆంధ్రప్రదేశ్‌కి వస్తే, అందులో మూడొంతుల పెట్టుబడులు రాయలసీమకు కేటాయించిన ఘనత చంద్రబాబుకు దక్కుతుందన్నారు. 4.58 లక్షల కోట్ల పెట్టుబడులు, 2.76 లక్షల మంది నిరుద్యోగుల ఉపాధి కల్పన కోసం దేశంలోనే ఒక ప్రాంతానికి(రాయలసీమ) ఇన్ని లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చిన ఘనత చంద్రబాబుదని, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ తన పాదయాత్రలో ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు మిషన్ రాయలసీమ చేపట్టారన్నారు. ఇరిగేషన్ శాఖ నిధులను పెద్ద ఎత్తున కేటాయించి హెచ్ఎన్ఎస్ఎస్, జిఎన్ఎస్ఎస్ పెండింగ్ పనులను టీడీపీ ప్రభుత్వం పూర్తి చేస్తోందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో టీడీపీ నాయకులు అబ్దుల్ అజీజ్, డా. జడ్ శివ ప్రసాద్, కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, కోటంరెడ్డి శ్రీనివాసుల రెడ్డి, రూప్ కుమార్ యాదవ్, చెంచల బాబు యాదవ్, జెన్ని రమణయ్య, కొండూరు పాలిశెట్టి, భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఏళ్ల నాటి సమస్యకు త్వరితగతిన పరిష్కారం

**- ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డికి స్థానికుల కృతజ్ఞతలు**



**నెల్లూరు, జూలై 15, ప్రభాతవార్త – వైద్యం** నెల్లూరు నగరంలోని జేమ్స్ గార్డెన్, వెంకట్రామపురం ప్రాంతాల ప్రజలు తమ ప్రాంతంలో దీర్ఘకాలంగా ఉన్న సమస్యను పరిష్కరించిన నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని బుధవారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. జేమ్స్ గార్డెన్, వెంకట్రామపురం ప్రాంతాలకు ఆనుకుని ఉన్న రైల్వే ట్రాక్ వెంట రక్షణ గోడ లేకపోవడంతో అక్రమ కార్యకలాపాలు, అసాంఘిక చర్యలు పెరుగుతున్నాయని, ముఖ్యంగా రాత్రి వేళల్లో స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారని గతంలో ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యపై వెంటనే స్పందించిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి వెంటనే రైల్వే రక్షణ గోడకు నిధులు మంజూరు చేశారు. మూడు నెలల్లోపే నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకున్నారు. చాలా ఏళ్లుగా పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న సమస్యకు వేగంగా పరిష్కారం చూపినందుకు స్థానికులు ఎంపీకి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఎంపీని కలిసిన వారిలో టీడీపీ 45వ డివిజన్ అధ్యక్షులు సుజన్ కుమార్, శ్రీనివాసులు రెడ్డి, నాగేశ్వరరావు, శివకుమార్, నాగేందర్ రావు, అన్నపూర్ణ తదితరులు ఉన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలి



**కోవూరు, జూలై 15 ప్రభాతవార్త :** రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పార్టీ శ్రేణులంతా సమన్వయంతో పనిచేస్తూ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. పార్టీ రాష్ట్ర కార్యాలయం ఆదేశాల మేరకు బుధవారం కోవూరులోని కార్యాలయంలో టీడీపీ నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎస్ఐఆర్ కార్యక్రమంలో కోవూరు నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులంతా అంకితభావంతో పని చేశారని, వారిని ప్రత్యేకంగా అభినందిస్తున్నామన్నారు. ఎన్నికల సంఘం మరో 10 రోజులు గడువు ఇచ్చిన నేపథ్యంలో బీఎల్‌వోలు సద్వినియోగం చేసుకుని పూర్తి చేయాలన్నారు. పార్టీకి సంబంధించిన ప్రతి కార్యక్రమాన్ని మై టీడీపీ యాప్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. పని చేయడం ఎంత ముఖ్యమో పార్టీకి ఆ పని కనిపించేలా యాప్‌లో నమోదు చేయడం అంతే ముఖ్యమన్నారు. ఈ రెండేళ్లలో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌ల ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందన్నారు. ఒక్క కోవూరు నియోజకవర్గంలో ఇప్పటికే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా పార్టీ శ్రేణులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఇప్పటికే కోవూరు నియోజకవర్గంలో ఆపదలో ఉన్న కుటుంబాలకు 11 కోట్ల మేర ఆర్థిక సాయం అందించారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు వ్యక్తిగత బేధాభిప్రాయాలు పక్కనపెట్టి పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. గ్రామాల్లో వర్గాలు ఉన్నా ఎన్నికల సమయంలో అందరూ ఏకమై పార్టీ అభివృద్ధిలో విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సమావేశంలో పాల్గొన్న పలు నాయకులు వారి సమస్యలను వివరించారు. జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు రెడ్డి, ఐదు మండలాల అధ్యక్షులు, సమన్వయకర్తలు, ఉన్నారు.

## ఎస్ఐ నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి



**గూడూరు, జూలై 15, ప్రభాతవార్త** గూడూరు ప్రభుత్వ ఏరియా వైద్యశాల వద్ద హై టెన్షన్ వాతావరణం చోటుచేసుకుంది. మనుబోలు మండలం చెరుకుముడిలో బొల్లి ఏడుకొండలు అనే వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందాడు. గత మూడు రోజుల క్రితం బంగారం దొంగతనం కేసులో మృతుడిని మనుబోలు పోలీసులు అరెస్ట్ చేశారు. ఏడుకొండలుని పోలీసులే కొట్టి హత్య చేశారని మృతిని బంధువులు ఆరోపిస్తున్నారు. గూడూరు పట్టణంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో ఉన్న ఏడుకొండలు మృతదేహాన్ని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పరిశీలించారు. వైసిపి నాయకులు కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. మృతదేహాన్ని చూసేందుకు కాకాణి గోవర్ధన్ రెడ్డిని అనుమతించగా, మిగిలిన వైసీపీ శ్రేణులను అనుమతించకపోవడంతో పోలీసులకు, వైసీపీ శ్రేణులకు మధ్య ఉద్రిక్తత వాతావరణం చోటుచేసుకుంది. అనంతరం మాజీ మంత్రి గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో దళితులు అణగారిన వర్గాలపై ప్రభుత్వంలో ఉన్న పెద్దలు కక్ష సాధింపు చర్యలు చేస్తున్నారన్నారు. ఏడుకొండలుని పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించి థర్డ్ డిగ్రీ ఉపయోగించారని, పోలీసుల ఆధ్వర్యంలో చనిపోయాడు కాబట్టి అతని మృతిని లాక్ అప్ డెత్‌గా పరిగణించాల్సిందే నన్నారు. ఏడుకొండలుని పోలీసులు మూడు రోజులపాటు స్టేషన్‌లో ఉంచి తీవ్రంగా కొట్టారని.. పోలీసులు ఉన్నతాధికారుల సహకారంతో హత్యను ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఎస్సై హనీఫ్ పై గతంలో పొదలకూరు పోలీస్ స్టేషన్‌లో పలు ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో మృతుడిని విచారిస్తున్న సమయంలో సిసి ఫుటేజ్ రికార్డులను పరిశీలించాలని డిమాండ్ చేశారు. ఏడుకొండలు కుటుంబానికి న్యాయం జరిగే వరకు వదిలిపెట్టే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. మృతుని కుటుంబానికి న్యాయం చేయకపోతే మృతదేహాన్ని మనుబోలు పోలీస్ స్టేషన్ ఎదుట ఉంచి ఆందోళన నిర్వహిస్తామన్నారు. వీరితోపాటు పలు ప్రజా సంఘాల నాయకులు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నారపరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి పాలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు మృతుని కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించాలని బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మేరీగా మురళి, తిరుపతి ఎంపి గురుమూర్తి, సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, నాయకులు ఎల్లసిరి గోపాల్ రెడ్డి, మీరా రెడ్డి, జడ్పిటిసి యామిని, గూడూరు ఎంపీపీ గురవయ్య, పాల్గొన్నారు.

## నేడు పులికల్లులో పల్లెవీక్షణం

**- అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను స్వయంగా పరిశీలించనున్న జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల**



**నెల్లూరు, జూలై 15, ప్రభాతవార్త – కలెక్టరేట్:** గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలును క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరించడమే లక్ష్యంగా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల చేపట్టిన పల్లెవీక్షణం కార్యక్రమం 16న గురువారం పొదలకూరు మండలం పులికల్లు గ్రామంలో నిర్వ హించను న్నారు. ఈ సందర్భంగా గ్రామంలో జరు గుతున్న వివిధ అభివృద్ధి పనులను పరిశీలించడంతో పాటు ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవలను సమీక్షించనున్నారు. పర్యటనలో భాగంగా ఉ ద్యాన శాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న ఏపీఎం ఐపీ డ్రిప్ ఇరిగేషన్ పథకాన్ని కలెక్టర్ పరిశీలిస్తారు. అనంతరం వీబీజీ రాంజీ కాలువ (జలధార–జల హారతి) పనులను సందర్శించి పురోగతిని సమీక్షిస్తారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రం, ఓహెచ్ఎస్ఆర్ ట్యాంక్, తాగునీటి నాణ్యత పరీ క్షలు, పశువుల తాగునీటి తొట్టి, సాలిడ్ వెస్ట్ ప్రా సెసింగ్ సెంటర్ (ఎస్‌డబ్ల్యూపీసీ) షెడ్, వెంక టాపురం గ్రామంలోని పశువుల షెడ్లను పరిశీలించి సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు ఇవ్వనున్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆద ర్శ రైతుతో కలెక్టర్ ముఖాముఖి నిర్వహించి, వ్యవసాయంలో అనుసరిస్తున్న వినూత్న పద్ధతులపై చర్చించనున్నారు. డీఆర్‌డీఏ (వెలుగు) ఆధ్వర్యంలో కెనరా బ్యాంకు ద్వారా 16 మంది స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.16 లక్షల స్త్రీ శక్తి రుణాలను పంపిణీ చేయనున్నారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశుగ్రాస విత్తనాలు, పశుగ్రాసాన్ని లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నారు. చివరగా గ్రామస్తులతో సమావేశమై వారి సమస్యలు, వినతులను నేరుగా స్వీకరిస్తారు. ఈ పల్లె వీక్షణ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొంటారు.

## నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించేందుకు వ్యాపారులు సహకరించాలి

**ధరల పర్యవేక్షణ కమిటీ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం. వెంకటేశ్వర్లు**



**నెల్లూరు, జూలై 15, ప్రభాతవార్త – కలెక్టరేట్** నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో బుధవారం జాయింట్ కలెక్టర్ ఎం. వెంకటేశ్వర్లు అధ్యక్షతన ధరల పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లాలోని రైస్ మిలర్లు, దాల్ మిల్లర్లు, హోల్‌సేల్ వ్యాపారులు హాజరయ్యారు. ఈ సమావేశంలో జిల్లాలో గత నెల రోజుల్లో నిత్యావసర వస్తువుల ధరలు గణనీయంగా పెరిగిన అంశాన్ని సమీక్షించారు. ధరల పెరుగుదలకు గల కారణాలపై వ్యాపారులతో జాయింట్ కలెక్టర్ సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు నిత్యం వినియోగించే కందిపప్పు, మినపప్పు, వంట నూనెలు, బియ్యం ధరలు ఈ నెలలో అధికంగా పెరిగాయని తెలిపారు. ధరలను తగ్గించేందుకు రైస్ మిల్లర్లు, దాల్ మిల్లర్లు, వ్యాపారులు జిల్లా యంత్రాంగానికి పూర్తి సహకారం అందించాలని కోరారు. ముఖ్యంగా బియ్యం ధరలు అధికంగా పెరిగిన నేపథ్యంలో, మిల్లర్లు సమన్వయంతో వ్యవహరించి ధరలను తగ్గించే చర్యలు చేపట్టాలని సూచించారు. దీనికి స్పందించిన మిల్లర్లు, వ్యాపారులు బియ్యం, పప్పుధాన్యాల ధరలను కిలోకు రూ.5 నుంచి రూ.9 వరకు తగ్గించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అదేవిధంగా నిత్యావసర వస్తువుల ధరలను అనవసరంగా పెంచకుండా, ప్రజల అవసరాలకు అనుగుణంగా తగినంత సరఫరా చేయాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. రైతు బజార్లలో కూడా నిత్యావసర వస్తువుల విక్రయానికి చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి పుల్లయ్య, మార్కెటింగ్ శాఖ ఏడీ అనిత, జిల్లా వ్యవసాయ అధికారి సత్యవాణి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సుబ్బారెడ్డి, ఏఎస్‌వో లక్ష్మినారాయణ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

## ఎంఈఓ 2ను కలిసిన ఏపీటీఎఫ్ నాయకులు



**వింజమూరు, జూలై 15, ప్రభాతవార్త :** వింజమూరు మండల నూతన విద్యాశాఖ అధికారి 2 బాధ్యతలు స్వీకరించిన ఎం. వెంకటేశ్వర్లు బుధవారం వింజమూరు మండలం ఏపీటీఎఫ్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సన్మానించారు. మండల స్థాయిలో ఉపాధ్యాయులు సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించి మండల అభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ 1 పి రమేష్, మండల ఏపీటీఎఫ్ అధ్యక్షులు జక్కం మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పి మాలకొండయ్య, జిల్లా కౌన్సిలర్ పి మల్లికార్జునరావు, పి రమణ రెడ్డి, పి రమణయ్య, టి శ్రీనివాసరావు, ధర్మపురి ప్రసాద్, జి సుబ్బరాయుడు, కే తిరుమల్ రెడ్డి, ఉప్పరపల్లి ప్రసాద్ రెడ్డి, పర్వత రెడ్డి కొండారెడ్డి, ఎంఈఓ కార్యాలయ సిబ్బంది ధర్మారెడ్డి మౌనిక, శ్రీహరి, ఇతర ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై పోలీసుల దాడులు

**సైదాపురం, జులై 15, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన సైదాపురంలోని తహసీల్దార్ కార్యాలయం పక్కన ఉన్న కొండ సమీపంలో గల పొదళ్ళలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై సైదాపురం ఎస్సై దుర్గా ప్రసాద్ బుధవారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైదాపురం సమీపంలోని తహసీల్దార్ కార్యాలయం దగ్గరలో ఉన్న విశాలమైన కొంత భూభాగాన పొదళ్ళలో పేకాట నిర్వహిస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు ఎస్సై వారి సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ దాడుల్లో ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రూ.8750 నగదు, మూడు బైక్‌లు, నాలుగు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకోవడం జరిగిందని ఆయన తెలిపారు. సైదాపురం మండలంలో ఎవరైనా కోడి పందాలు, పేకాట నిర్వహిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.



## కారులో వ్యక్తి మృతి

**కోవూరు జులై 15 ప్రభాతవార్త** కోవూరు పట్టణంలో బుధవారం స్కార్పియో కారులో వడ్డిపాళెంకు చెందిన ఆవుల నాగేశ్వరరావు మృతి చెంది ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టరం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు నాగేశ్వరరావుకు భార్య, పిల్లలు ఉన్నట్లు తెలిసింది,మృతి కారణాలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈకారు ఉదయం నుండి ఇదే ప్రాంతంలో ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు.



## ఆత్మహత్యల నివారణ మహిళా భద్రతపై విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన



**అల్లూరు, జులై 15 ప్రభాతవార్త :** అల్లూరు నగర పంచాయితీ పరిధిలోని దేవిరెడ్డి శారదా హైస్కూల్‌లోని విద్యార్థిని విద్యార్థులకు బుధవారం ఆత్మహ్యల నివారణ మహిళా భద్రత, సైబర్ భద్రత అంశాలపై జిల్లా మహిళా శిశుసంక్షేమ సాధికారిక అధికారిని ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ బి హేనా సుజన్ ఆధ్వర్యంలో డిఎస్ఆర్ ట్రస్టు అడ్మిన్ మేనేజర్ అనీల్‌కుమార్‌రెడ్డి సమక్షంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ పిడి హేనాసుజన్ విద్యార్థిని విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ చదువు, కటుంబం లేదా వ్యక్తిగత జీవితంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఆత్మహత్య అనేది ఎప్పటికి పరిష్కారం కాదని సమస్యలు వచ్చినపుడు ఒంటరిగా బాధపడకుండా తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు,లేదానమ్మకమైన వ్యక్తులతో సమస్యను పంచుకోవాలని అవసరమైతే మానసిక, నిపుణుల సాయం తీసుకోవాలని సూచిచారు. యుక్తవయసులో భావోద్వేగాలకు లోనై తొందరపాటు నిర్ణయాలు తీసుకోకుండా ఆత్మవిశ్వాసంతో తమ లక్ష్యాలను సాధించే దిశగా కృషి చేయాలని విద్యార్థులకు తెలిపారు. విద్యార్థులు సోషల్‌మీడియా, ఇంస్టాగ్రామ్, ఆన్‌లైన్ గేమ్స్ వంటివాటికి ప్రభావానికి గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని మహిళలు పిల్లల కోసం ప్రభుత్వం అందుబాటులో ఉంచిన అత్యవసర హెల్ప్‌లైన్ 1930,14416,181,112 నెంబర్లు గురించి వివరించడం జరిగింది. మానిసక ఒత్తిడిసమయంలో తీసుకోవాల్సి న జాగ్రత్తలు, అదే విధంగా సఖీవన్ స్టాప్ సెంటర్ అందించే సేవలు గురించి వివరించారు. అనంతరం పాఠశాల సిబ్బందికి పని ప్రదేశాలలో మహిళలపై లైంగిక వేధింపుల (నివారణ నిషేద మరియ పరిష్కారం చట్టం) యాక్ట్ 2013పై ప్రత్యేక అవగాహన కల్పించారు. కావలి సిపిడిఓ ఎం.రాజ్యలక్ష్మి సఖీ వన్‌స్టాప్ సెంటర్ కేప్ వర్కర్ జి.సాధన మంజుల,ట్రస్ట్‌స్కిల్ డెవలెప్‌మెంటు ఇన్‌చార్జ్ రామచంద్రరావు, ఉపాధ్యాయులు, ట్రస్టు సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## మలిదేవిపైన బ్రిడ్జి నిర్మాణం పరిశీలించిన క్వాలిటీ కంట్రోల్ ఎస్ఇ ఓ.శారద

**బుచ్చిజులై 15 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెంలోని మున్సిపాల్టీలో మలిదేవి పైన బ్రిడ్జి నిర్మాణాన్ని క్వాలిటీ కంట్రోల్ ఎస్ఇ ఓ.శారద పరిశీలించారు. బ్రిడ్జి నిర్మాణం నాణ్యత ప్రమాణాలను పూర్తి స్థాయిలో పరిశీలించారు .సంబంధిత అధికారు లతో బ్రిడ్జి నిర్మాణం గురించి చర్చించారు. నిర్మాణం నాణ్యతా ప్రమాణాలతో నిర్మాణం జరుగుతుందని సంతృప్తి వ్యక్తం చేశారు. కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆదేశాలతో బ్రిడ్జికి ఇరువైపుల సైడ్ వాల్ డిజైనింగ్ పూర్తి చేసినట్లు తెలిపారు. త్వరలోనే బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ ఇఇ కె . ధనుంజయనాయుడు, క్వాలిటీ కంట్రోల్ డిఇ బాబు రాజేంద్ర ప్రసాద్, ఎఇలు తదితరులున్నారు.



## ఆందోళనలో ఆత్మహత్య

**మనుబోలు ,జులై 15, ప్రభాతవార్త :** నిందితుడు ఏడుకొండలు పోలీసు వస్తున్నారన్న విషయం తెలుసుకున్న సమాచారంతో భయాందోళనలో పోలీసులు వచ్చే సమయానికి పురుగు మందు తాగారు. ఈ సమయంలో వెళ్ళిన పోలీసులు విషయం తెలుసుకోకుండా కాలువ గట్టుపై ఉన్న ఏడుకొండలును తీసుకొని వస్తుండగా మార్గమధ్యంలో ఆపస్మారక స్థితికి రావడంతో గూడూరు ఏరియా ఆసుపత్రికి తీసుకుని వెళ్ళగా వైద్యులు మృతి చెందినట్లు చెప్పడంతో పోస్టుమార్టరం కోసం తరలించారు. ఈకేసు పూర్తి వివరాలు పోస్టుమార్టం నివేదిక వచ్చిన తరువాత అన్ని విషయాలు బయటకు వచ్చే అవకాశం ఉంది.అనుమానస్పదంగా నిందితుడు మృతి అనుమానాస్పదంగా ఓ నిందితుడు మృతి చెందిన సంఘటన మనుబోలు మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. మనుబోలు మండలంలో ఇటీవల ఎస్ఐ హానిప్ ఓ దొంగతనం కేసును చేదించి నిందితులను పట్టుకొని విచారిస్తుండగా తీగ లాగితే దొంక దొరికనట్లు బంగారు చోరీ కేసు విషయంలో మోటారు దొంగతనం చోరి బయటకు వచ్చి ఇప్పటికే సుమారు 25 మోటార్లు స్వాధీనం చేసుకొని ఈ కేసులో మరింత మంది నిందితులు కూడా ఉండడంతో వారిని అదుపులోకి తీసుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్న సమయంలో మండలంలోని చెరుకుమిడి గ్రామానికి చెందిన బొల్లి ఏడుకొండలును మంగళవారం పోలీస్ సిబ్బంది తీసుకొని వస్తున్న సమయంలో మార్గమధ్యంలో మృతి చెందాడు. ఈవిషయం పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



## చెత్త తొలగింపు ట్రాక్టర్లకు స్వస్తిరంగంలోకి ఈ ఆటోలు

**- చెత్త తరలింపునకు 200 ఎలక్ట్రిక్ ఆటోలు**

**- 18న తొలివిడతలో 100 వాహనాలను వర్చువల్‌గా ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు, మంత్రి నారాయణ**

**నెల్లూరు, జులై 15, ప్రభాతవార్త – వైద్యం:** నెల్లూరు నగరంలో చెత్త సేకరణ, తరలింపు వ్యవస్థను మరింత ఆధునికీకరించేందుకు కార్పొరేషన్ కీలక నిర్ణయం తీసుకుంది. ట్రాక్టర్ల ద్వారా చెత్త తొలగింపు విధానానికి స్వస్తి పలుకుతూ, నగరంలో 200 ఎలక్ట్రిక్ ఆటోలను వినియోగంలోకి తీసుకురా నుంది. ఇందులో భాగంగా తొలి విడతలో 100 ఎలక్ట్రిక్ ఆటోలను శనివారం నిర్వహించనున్న స్వచ్ఛాంధ్ర కార్యక్రమ ంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను గురువారం గాంధీబొమ్మ సెంటర్‌లో డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, కార్పొరేషన్ అధికారులు, పోలీసు అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం రూప్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ నగరంలో చెత్త సేకరణను మరింత సమర్థవంతంగా, పర్యావరణహితంగా నిర్వహించాలనే ఉద్దేశంతో మంత్రి నారాయణ ఎలక్ట్రిక్ ఆటోలను వినియోగంలోకి తీసుకురావాలని నిర్ణయించారని తెలిపారు. కార్పొరేషన్ పరిధిలో మొత్తం 200 ఎలక్ట్రిక్ ఆటోలను కొనుగోలు చేశామని, తొలి విడతలో 100 ఆటోలను స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, మంత్రి నారాయణ వర్చువల్‌గా ప్రారంభిస్తారని చెప్పారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని ఏర్పాట్లను పరిశీలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర టీడీపీ అధ్యక్షుడు మామిడాల మధు, శివాలయం చైర్మన్ అజయ్, టీడీపీ నాయకులు బాలాజీ, తిరుమలనాయుడు, జహీర్, దర్శి హరికృష్ణ, పిట్టి సత్య నాగేంద్ర, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



## బిట్రగుంట లో విక్రమ సింహపురి, తిరుమల ఎక్స్‌ప్రెస్ నిలుపుదలపై సానుకూల?

**బిట్రగుంట జులై 15 ప్రభాతవార్త :** విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలోని బిట్రగుంట రైల్వే స్టేషన్ లో విక్రమ సింహపురి ఎక్స్‌ప్రెస్, తిరుమల ఎక్స్‌ప్రెస్ నిలుపుదలపై రైల్వే అధికారులు సానుకూలత వ్యక్తం చేసినట్లు రైల్వే మజ్దూర్ యూనియన్ బిట్రగుంట బ్రాంచ్ చైర్మన్ మద్దిబోయిన శేఖర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఇటీవల బిట్రగుంటకు ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ వచ్చిన సందర్భంగా బిట్రగుంట లో విక్రమ సింహపురి ఎక్స్‌ప్రెస్, తిరుమల ఎక్స్‌ప్రెస్ నిలుపుదల చేయాలని వారు వినతిపత్రం సమర్పించగా దానిపైన స్పందించిన జనరల్ మేనేజర్ విజయవాడ డివిజనల్ ఆపరేటర్ కార్యాలయానికి వీటి నిలుపుదలపై సాధ్యాసాధ్యాలు వీలైనంత త్వరగా పరిశీలించి తనకు నివేదిక ఇవ్వాలని ఆయన ఆదేశించారు. ఈ మేరకు రైల్వే మజ్దూర్ విజయవాడ డివిజన్ కార్యాలయం కు దీనిపైన చర్యలు తీసుకుంటున్నట్లు నకలు ప్రతిని కూడా పంపారు. ఏది ఏమైనా ఈ రెండు ఎక్స్‌ప్రెస్ లు నిలుపుదల చేయాలని నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి రాజ్యసభ సభ్యులు డాక్టర్ బీద మస్తాన్ రావు యాదవ్ గతంలో రైల్వే అధికారులను కోరడం తెలిసిందే.అయితే ప్రజాప్రతినిధులు కూడా గట్టిగ మరో మారు ప్రయత్నం చేస్తే సమస్య పరిష్కారం కు దారి సుగమనం అవుతుంది.

## ఆత్మహత్య సమస్యలకు అంతిమ పరిష్కారం కాదు..

**నెల్లూరు క్రైమ్, జులై 15, ప్రభాతవార్త :** ఆత్మహత్య అనేది ఏ సమస్యకూ పరిష్కారం కాదు. ప్రతి సమస్యకు చట్టబద్ధమైన, సామాజికమైన పరిష్కారం ఉంటుంది. కష్టాలు శాశ్వతం కావు. సరైన సమయంలో సహాయం కోరితే ప్రతి సమస్యను అధిగమించవచ్చు అని జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల తెలిపారు. అర్ధ వార్షిక నేర సమీక్ష సమావేశంలో మీడియా సమక్షంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) సిహెచ్ సౌజన్య, టౌన్ ఏఎస్‌పి దీక్ష, నెల్లూరు రూరల్ డీఎస్పీ జి. శ్రీనివాసరావులతో కలిసి ఆంటీ సూసైడ్ అవేర్‌నెస్ పోస్టర్లు ఎస్పీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలు, ప్రేమలో విఫలం, పరీక్షల ఒత్తిడి, ఉద్యోగ సంబంధిత సమస్యలు వంటి కారణాలతో నిరాశకు గురయ్యే వారు ఒంటరిగా బాధపడకుండా కుటుంబ సభ్యులు, స్నేహితులు లేదా మానసిక ఆరోగ్య నిపుణులతో మాట్లాడాలని సూచించారు. మానసిక ఒత్తిడి, ఆందోళన లేదా ఆత్మహత్య ఆలోచనలు కలిగిన వారు కేంద్ర ప్రభుత్వ టెలీమానస్, ఉచిత మానసిక ఆరోగ్య సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. 14416 లేదా 18008914416 నంబర్లకు 24 గంటలూ కాల్ చేసి నిపుణుల సలహా పొందవచ్చని వివరించారు. అలాగే, ఆత్మహత్యకు సంబంధించిన సంకేతాలు కనిపించినప్పుడు కుటుంబ సభ్యులు, స్నేహితులు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే స్పందించి వారికి ధైర్యం చెప్పడంతో పాటు అవసరమైన సహాయాన్ని అందించాలని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీసు సహాయం కోసం 112, మహిళల సహాయానికి 181, చిన్నారుల కోసం 1098, సైబర్ నేరాల ఫిర్యాదులకు 1930 హెల్ప్‌లైన్ నంబర్లను వినియోగించాలని సూచించారు. చివరగా జిల్లా ఎస్పీ, ప్రతి జీవితం అమూల్యమైనది. కష్టకాలంలో సహాయం కోరడం బలహీనత కాదు, అది ధైర్యానికి నిదర్శనం. జీవితం విలువైనది జీవితాన్ని సార్థకం చేసుకోండి, ఆత్మహత్యకు దూరంగా ఉండండి అని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిఐ పాపారావు తదితరులు పాల్గొన్నారు.




## సాహిత్యం సమాజానికి దర్పణం లాంటిది

**నెల్లూరు క్రైం, జులై 15, ప్రభాతవార్త :** సమకాలీన సాహిత్యం సమాజానికి దర్పణం వంటిదని, సమాజానికి దిశానిర్దేశం చేసే శక్తి కూడా సాహిత్యానికి ఉందని, విజయవాడకు చెందిన మధురగాన వాచస్పతి హరి శంకర శర్మ పేర్కొన్నారు. నగరంలోని టౌన్ హాల్ ఆవరణలో ఉన్న వర్ధమాన సమాజం హాల్ లో చేతన సంగీత సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో శంకర శర్మ పాల్గొని సాహిత్యము సమాజము అనే అంశంపై ఉపన్యసించారు. సమాజ నిర్మాణంలో సాహిత్యం పోషించే పాత్ర, వ్యక్తిత్వ వికాసంలో సాహిత్య ప్రభావం మొదలైన విషయాలపై ఆయన ఉదాహరణలతో వివరించారు. నేటి సామాజిక పరిస్థితులలో రచయితలు మానవీయ విలువలను పరిరక్షించే విధంగా రచనలు చేయాలని శంకర శర్మ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలుగు భాషోద్యమ సమితి అధ్యక్షులు, రచయిత చలంచర్ల భాస్కర రెడ్డి మాట్లాడుతూ మంచి సాహిత్యం ద్వారా సమాజంలో ఎన్నో ప్రయోజనాలను పొందవచ్చని తెలియజేశారు. ఉపన్యాసం తరువాత వక్త హరి శంకర శర్మను చేతన నిర్వాహకులు అతిథులు ఘనంగా సత్కరించారు. సభా కార్యక్రమానికి ముందుగా, ఇటీవలే దివంగతులైన మధుర గాయని ఎస్. జానకికి నివాళులు అర్పిస్తూ రెండు నిముషాలు మౌనం పాటించారు. చేతన కార్యదర్శి వై. శేషగిరీశం, వీ.ఆర్. కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సుబ్రహ్మణ్యం సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సాహితీవేత్తలు డాక్టర్ గంగిశెట్టి శివకుమార్, బొగ్గరపు రాధాకృష్ణమూర్తి, వేదం సూర్యప్రకాశం, ప్రపంచ తెలుగు సమాఖ్య రీజినల్ వైస్ ఛైర్మన్ నలుబోలు బలరామయ్య నాయుడు, బాలభవన్ డైరక్టర్ జి. సుభద్రాదేవి, చేతన కార్యవర్గ సభ్యులు ఆదిశేషు, సుబ్బారాయుడు, కెపిఎన్, బుజ్జయ్య, వాసంతి తదితర సాహితీప్రియులు పాల్గొన్నారు. బుధవారం 81వ పుట్టినరోజు జరుపుకుంటున్న ముఖ్య అతిథి చలంచర్ల భాస్కర రెడ్డికి చేతన సంస్థ శుభాకాంక్షలు తెలియజేస్తూ, కేక్ కోయించి అభినందనలు అందజేసింది.



## కళ్ల పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి

**కోవూరు, జులై 15 ప్రభాతవార్త :** ప్రాథమిక దశ నుంచి ప్రతి విద్యార్థి శరీరంలో ప్రధాన అవయవమైన నేత్రాల పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఆప్తమాలజిస్ట్ లక్ష్మీప్రసన్న తెలిపారు. కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ప్రభుత్వం ద్వారా రూపొందించిన కంటి వెలుగు కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయిని సోఫియా కిరణ్మయి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఇంటి వద్ద సెల్‌ఫక్షన్ వినియోగాన్ని తగ్గించాలన్నారు. కళ్లకు ఏమైనా జరిగితే జీవితమే అంధకారం అవుతుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని కళ్ల పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులందరికీ కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆరోగ్య సిబ్బంది హెల్త్ సూపర్‌వైజర్ ఇలియాజ్, ఏఎన్ఎం ఉమాదేవి, ఎంఎల్‌హెచ్‌పీ ప్రియాంక, హెచ్ఎస్ సురేష్, ఆశా కార్యకర్తలు ఉన్నారు.



## నేర రహిత నెల్లూరు దిశగా ఏ గ్రేడ్‌తో దూసుకుపోతున్న జిల్లా పోలీస్ యంత్రాంగం

**- రాష్ట్ర స్థాయిలో 82 మార్కులతో అగ్రగామిగా నిలిచిన జిల్లా పోలీస్ యంత్రాంగం**

**- మనుబోలు సంఘటనపై పూర్తిస్థాయి దర్యాప్తు**

**- అర్ధవార్షిక సమీక్షలో వెల్లడించిన ఎస్పీ డా. అజిత వెజెండ్ల**

**నెల్లూరు క్రైం, జులై 15, ప్రభాతవార్త :** జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణలో జిల్లా పోలీసు శాఖ సరికొత్త రికార్డులను సృష్టిస్తోంది. 2026 ప్రథమార్ధంలో జనవరి నుండి జూన్ వరకు నిర్వహించిన పనితీరు సమీక్షలో రాష్ట్ర స్థాయి కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్‌లో 82 మార్కులు సాధించి ఏ గ్రేడ్‌ను కైవసం చేసుకుంది. ఈ విషయాన్ని జిల్లా ఎస్పీ డా. అజిత వెజెండ్ల మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో వెల్లడించారు.



**– నేరస్థులపై ఉక్కుపాదం – కఠిన చర్యలు..** జిల్లాలో నేరాలను అదుపులోకి తెచ్చేందుకు పోలీసు యంత్రాంగం కఠిన వ్యూహాలను అమలు చేస్తోంది. గడిచిన ఆరు నెలల్లోనే 37 మందిపై పీడీ యాక్ట్, 10 మందిపై పిట్ఎన్‌డీపీఎస్ చట్టాలను ప్రయోగించామని ఎస్పీ తెలిపారు. అలాగే, నేర ప్రవృత్తి ఉన్న 76 మందిపై సెక్సువల్ అఫండర్ షీట్స్ తెరిచి నిరంతరం నిఘా ఉంచినట్లు పేర్కొన్నారు. ప్రజల భద్రతే ధ్యేయంగా జిల్లా వ్యాప్తంగా 153 ఖికార్డన్ అండ్ సెర్చ్‌ఖి ఆపరేషన్లు నిర్వహించి, అనుమానాస్పద వ్యక్తులపై ఉక్కుపాదం మోపామని ఆమె వివరించారు.

**– స్మార్ట్ పోలీసింగ్‌తో సామాన్యుడికి భరోసా..**టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో జిల్లా పోలీసులు రాష్ట్రంలోనే ముందు వరుసలో నిలిచారు.

**– నిరంతర నిఘా..**డ్రోన్లు, నైట్ విజన్ డ్రోన్ల ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నిరంతరం పహారా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. నెల్లూరు నగరంతో పాటు కావలి, గూడూరు, ఆత్మకూరు పట్టణాల్లో ప్రత్యేక బృందాలతో రాత్రిపూట గస్తీ.

**– శక్తి బృందాలు:** మహిళలు, విద్యార్థినుల భద్రత కోసం పనిచేస్తున్న 7 శక్తి బృందాలు 4,550 అవగాహన కార్యక్రమాలను నిర్వహించాయి. జిల్లాలో శక్తి యాప్ డౌన్‌లోడ్లలో నెల్లూరు ప్రథమ స్థానంలో ఉంది.

**– తగ్గిన నేరాలు.. పెరుగుతున్న శిక్షలు..**గత ఏడాదితో పోలిస్తే హత్యలు, దోపిడీలు, దొంగతనాలు, రోడ్డు ప్రమాదాల్లో గణనీయమైన తగ్గుదల నమోదైందని ఎస్పీ అజిత వెజెండ్ల వెల్లడించారు. సమర్థవంతమైన దర్యాప్తు, పటిష్టమైన సాక్ష్యాధారాల సమర్పణ ఫలితంగా ఈ ఆరు నెలల్లోనే హత్యలు, పోక్సో, అత్యాచారాలకు సంబంధించిన 17 కీలక కేసుల్లో నిందితులకు కోర్టు ద్వారా కఠిన శిక్షలు పడేలా చేయడంలో జిల్లా పోలీసు విభాగం విజయం సాధించినట్లు తెలిపారు. మనుబోలులో జరిగిన సంఘటనకు సంబంధించిన ఏడుకొండలు మరణం లాకప్‌లో చోటు చేసుకోలేదని, అతను బలవన్ మరణానికి పాల్పడినట్లు ప్రాథమికంగా తమ దర్యాప్తులో వెల్లడైందన్నారు. అతని మరణం పై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపడతామని ఎస్పీ స్పష్టం చేశారు. ప్రజల సహకారం, సిబ్బంది అంకితభావంతో నెల్లూరును అత్యంత సురక్షితమైన జిల్లాగా తీర్చిదిద్దుతాం అని ఎస్పీ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) సౌజన్య, టౌన్ ఏఎస్పీ దీక్ష, డీఎస్పీ జి శ్రీనివాసరావు, ఎస్బి సీఐలు దశరథ రామారావు, శ్రీనివాస్ రెడ్డి, సీసీఎస్ సీఐ పాపారావు ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## ఆత్మకూరి లక్ష్మయ్య చిత్రపటానికి నివాళులర్పించిన మన్నెమాల

**కావలి, జులై 15 ప్రభాతవార్త :** పట్టణంలోని ఏపిస్టేట్ ఎస్సి కాలనీలో బుధవారం ఆత్మకూరి లక్ష్మయ్య పెద్దకర్మ కార్యక్రమం జరిగింది. ఈకార్యక్రమానికి ఏఎంసి మాజీ ఛైర్మెన్, నియోజకవర్గ సీనియర్ నాయకులు మన్నెమాల సుకుమార్‌రెడ్డి పాల్గొని లక్ష్మయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం లక్ష్మయ్య కుటుంబసభ్యులు పరామర్శించి సానుభూతిని వ్యక్తం ధైర్యం చెప్పారు. సుకుమార్‌రెడ్డి ఆ ప్రాంతానికి రావడంతో యువత, స్థానికులు అధికసంఖ్యలో విచ్చేసి ఆయనను ఆత్మయంగా పలకరిం చడం జరిగింది.

## వైభవంగా రుద్రాభిషేకం

**గూడూరు, జులై 15, ప్రభాతవార్త:** శ్రీ శ్రీ శ్రీ విజయ దుర్గ పీఠాధిపతుల వారి దివ్య ఆశీస్సులతో గూడూరులోని శ్రీ విజయ దుర్గ అమ్మవారి ఉప పీఠం నందు మనం ప్రతిరోజు నిర్వహించే శ్రీ విజయ దుర్గ అమ్మవారి నిత్య పూజ కార్యక్రమాల్లో భాగంగా శ్రీ విజయ చంద్రమౌళీశ్వర స్వామి వారికి విశేష రుద్రాభిషేక అనంతరం శ్రీ విజయ దుర్గ అమ్మవారి శ్రీ చక్ర పూజ మన పీఠ భక్తుల సర్వ శుభాల కొరకు లోక కళ్యాణార్థం ఎంతో విశేషరీతిలో నిర్వహించడం జరిగింది.



## ఈ నెల 18న ప్రజల సమస్యలు - ప్రభుత్వం దృష్టికి కార్యక్రమం

**– ఆంధ్రప్రదేశ్ యునైటెడ్ రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు కొప్పుల సూర్య నారాయణ**

**పొదలకూరు, జులై 15, ప్రభాతవార్త :** యునైటెడ్ రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షులు గుణశేకరన్ ఆదేశాలు మేరకు ప్రజల సమస్యలు – ప్రభుత్వం దృష్టికి కార్యక్రమం ఈ నెల 18వ తేది నుండి డిసెంబర్ 10 తేదీ వరకు శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలోని అన్ని గ్రామాల్లో పర్యటించి ప్రజల యొక్క సమస్యలను తెలుసుకొని వారి సమస్యల పరిష్కారం కొరకు రాష్ట్ర కూటమి ప్రభుత్వం దృష్టికి ఆంధ్రప్రదేశ్ యునైటెడ్ రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు కొప్పుల సూర్య నారాయణ తెలియచేసారు. ప్రజలు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం సర్వేపల్లి నియోజకవర్గ పరిధిలోని పొదలకూరు మండలం నుండి ప్రారంభం అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఒక భాగంగా పార్టీ నిర్మాణం కోసం ప్రజల నుండి స్వచ్ఛందంగా విరాళాలు సేకరించడం జరుగుతుందని ప్రజలు అందరూ ఆంధ్రప్రదేశ్ యునైటెడ్ రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా పార్టీని ఆదరించాలని కోరారు.



## ఆక్రమణ భూమికి రెవెన్యూ అధికారులచే హద్దులు

**- కోటి తీర్థంలో పోలీసుల బందోబస్తుతో సర్వే**

**చేజర్ల, జులై15, ప్రభాతవార్త :** చేజర్ల మండలం కోటితీర్థం గ్రామంలో ప్రభుత్వ మంజూరు భూమికి సంబంధించిన వివాదం బుధవారం ఉద్రిక్తతకు దారి తీసింది. రెవెన్యూ అధికారులు, పోలీసుల సమక్షంలో భూమికి హద్దులు చూపించగా, ఇరు వర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకున్నట్లు తెలిసింది. గ్రామానికి చెందిన కొమ్మి సుబ్బమ్మ, భర్త పెంచలయ్యకు సుమారు 20 సంవత్సరాల క్రితం ప్రభుత్వం సర్వే నంబర్ 897/పిలో 1.50 ఎకరాల భూమి మంజూరు చేసింది. అయితే ఈ భూమిలో కొంత భాగాన్ని పక్కనే ఉన్న సరోజనమ్మ ఆక్రమించి సాగు చేస్తున్నారని సుబ్బమ్మ ఇటీవల చేజర్ల తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. తనకు కేటాయించిన భూమిని గుర్తించి హద్దులు ఏర్పాటు చేయాలని వినతిపత్రం సమర్పించారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ రికార్డులను పరిశీలించి, భూమి ఆక్రమణపై సంబంధిత వ్యక్తికి మూడు విడతల్లో నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. అయితే నోటీసులకు ఎలాంటి వివరణ ఇవ్వకుండానే భూమిలో వరి సాగు చేసినట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికే రెవెన్యూ అధికారులు, గ్రామ రెవెన్యూ అధికారి వివాదస్పద భూమిలో ఎలాంటి సాగు చేయవద్దని సూచించినప్పటికి, వాటిని పట్టించుకోకుండా పంట సాగు చేసినట్లు వెల్లడైంది. ఈ నేపథ్యంలో బుధవారం రెవెన్యూ అధికారులు, పోలీసు బందోబస్తుతో సంఘటన స్థలానికి చేరుకుని ప్రభుత్వ రికార్డుల ఆధారంగా భూమిని కొలిచి హద్దులు చూపించారు. ఈ సందర్భంగా ఇరు వర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకోగా, సరోజనమ్మ వృద్ధురాలు సుబ్బమ్మతో ఘర్షణకు దిగినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ విషయమై చేజర్ల తహసీల్దార్ మస్తానయ్యను వివరణ కోరగా, సర్వే నంబరు 897/పీలోని 1.50 ఎకరాల భూమి ప్రభుత్వ రికార్డుల ప్రకారం కొమ్మి సుబ్బమ్మ పేరునే నమోదై ఉందని తెలిపారు. అధికారిక రికార్డుల మేరకు భూమిని కొలిచి హద్దులు చూపించినట్లు ఆయన స్పష్టం చేశారు.



## స్వర్ణముఖి బ్యారేజ్ దిగువ ఆయకట్టుదారులకు సాగునీరు అందించాలి

**- బిజెపి నమామిగంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్**

**నెల్లూరు, జులై 15, ప్రభాతవార్త – అగ్రికల్చర్ :** స్వర్ణముఖి బ్యారేజ్ దిగువ ఆయకట్టుదారులకు సాగునీరు అందించాలని తెలుగు గంగ ఎస్ ఈ సుబ్రహ్మణ్యేశ్వర శర్మకు, నెల్లూరులోని ఆయన కార్యాలయంలో బుధవారం బిజెపి నమామిగంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ వినతి పత్రం అందజేసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐఏబి సమావేశం నిర్ణయాల మేరకు కండలేరు నుండి నీరు విడుదల చేసి నెల గడిచినా స్వర్ణముఖి బ్యారేజ్‌కి నీరు చేరలేదన్నారు. ఇసుక అక్రమార్కుల వాహనాల రాకపోకల కోసం గంగ జలాల ప్రవాహాన్ని తక్కువగా విడుదల చేశారని రైతులు ఆరోపిస్తున్నట్టు చెప్పారు. బ్యారేజీ ద్వారా 20,000 ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉండగా ఇప్పటివరకు బ్యారేజ్ నుండి చుక్కనీరు కూడా దిగువకు విడుదల కాలేదన్నారు .తెలుగు గంగ జలాలను బ్యారేజీ ఎగువ ప్రాంతంలో ఉన్న గ్రామల వారు మాత్రమే తరలించుకుంటున్నారని తెలిపారు. రైతుల ప్రయోజనాల దృష్ట్యా తెలుగు గంగ నీటి ప్రవాహ వేగాన్ని పెంచాలని ప్రాజెక్ట్ పర్యవేక్షణ ఇంజనీర్‌కు రమేష్ విజ్ఞప్తి చేశారు.



## డిఎస్పి వేమారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన ముక్కు రాధాకృష్ణ గౌడ్

**నెల్లూరు, జులై 15, ప్రభాతవార్త – అగ్రికల్చర్ :** నెల్లూరు నగరంలో వివిధ హోదాల్లో పోలీస్ అధికారిగా పనిచేసిన వేమారెడ్డి, నెల్లూరు మహిళా పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. ఆయనను బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముక్కు రాధాకృష్ణ గౌడ్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. గతంలో సుపరిచితులుగా ఉన్న ఆయనకు బొకే అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ గౌడ్ మాట్లాడుతూ వేమారెడ్డి నెల్లూరు జిల్లాలో అనేక సంవత్సరాలుగా ఎస్సైగా, సీఐగా బాధ్యతలు నిర్వర్తించి మంచి పేరు తెచ్చుకున్నారని గుర్తు చేశారు. ఆయన డిఎస్పీగా బాధ్యతలు చేపట్టడం పట్ల జిల్లా ప్రజల్లో ఆనందం వ్యక్తం అవుతుందన్నారు. సమాజంలో నైతిక విలువలతో కూడిన మంచి కుటుంబ వ్యవస్థను కట్టుబాట్లను కొనసాగే విధంగా ఆయన పని చేయాలని రాధాకృష్ణ గౌడ్ ఆకాంక్షించారు. నాయకులు దద్దోలు పవన్ తేజ గౌడ్, దోర్నాధుల పవన్ గౌడ్ పాల్గొన్నారు.



## పాలిటెక్నిక్ కోర్సులు.. ఉపాధికి బాటలు

## కరస్పాండేట్ నేదురుమల్లి రామ్ కుమూర్‌రెడ్డి

**కోట,జులై 15 ప్రభాతవార్త :** సాంకేతిక విద్యతో స్థిరమైన ఉద్యోగావకాశాలు కల్పించడంలో పాలిటెక్నిక్ కోర్సులు ప్రథమ స్థానంలో ఉన్నాయి. పదో తరగతి అనంతరం మూడు సంవత్సరాల కోర్సులు పూర్తి చేసిన తర్వాత పరిశ్రమల్లో డిప్లొమా ఇంజినీర్లుగా స్థిర పడొచ్చు. చిన్న వయస్సులో స్థిరపడాలనుకునే వారికి పాలిటెక్నిక్ కోర్సులు మంచి ఉద్యోగావకాశాలను కల్పిస్తున్నాయి.కోట మండలంలోని విద్యానగర్‌లోని ఎన్‌బీకే ఆర్‌లో కొత్తగా పాలిటెక్నిక్ కోర్సు ను అందుబాటులో తీసుకొచ్చారు.



**ఈసెట్‌తో ఉన్నత విద్య :** పాలిటెక్నిక్ కోర్సులు పూర్తి చేసిన తర్వాత ఉన్నత విద్యకు మరో అవకాశం ఉంది. ఈసెట్‌తో ఇంజినీరింగ్ చదివే అవకాశం ఉంది. ఈ సెట్‌తో ప్రవేశం పొందిన విద్యార్దులు నాలుగేళ్ల ఇంజినీరింగ్ కోర్సులో నేరుగా రెండో ఏడాదిలో చేరవచ్చు.

**మెరుగైన ఉద్యోగావకాశాలు :**పాలిటెక్నిక్ విద్య పూర్తి చేసిన విద్యార్దులకు ప్రభుత్వ ప్రవేట్ రంగాల్లో మెరుగైన ఉపాధి అవకాశాలు ఉన్నాయి, ప్రవేట్ సంస్థలు, ప్రాంగణ నియామకాలకు చొరవ కనబరుస్తున్నాయి. ఈ ఏడాది కొత్త కోర్సులు అందుబాటులో కి రావడంతో విద్యార్దులు పాలిట్నెక్ కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు.

**నేడే ఎన్‌బీకేర్‌లో అవగాహన సదస్సు :** నేడు గురువారం విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఇంజినీరింగ్ కళాశాలో నూతనంగా పాలిటెక్నిక్ చేరి విద్యార్దులకు వారి తల్లిదండ్రులకు అవగాహన సదస్సు జరుగుతుందని కరస్పాడెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. కళాశాలలో ఉన్న మౌలిక వసతులుపై విద్యార్దులకు వివరించడం జరుగుతుందన్నారు.

## గురుకులంలో కంటి వెలుగులో 597 మందికి కంటి పరిక్షలు

**కండలేరుడ్యాం(రాపూరు),జులై15ప్రభాతవార్త :** మండలంలోని కండలేరు డ్యాంలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలలో బుధవారం నిర్వహించిన కంటి వెలుగు ప్రోగ్రాంలో పాఠశాలలోని 597 మంది విద్యార్థులకు కంటి పరిక్షలను నిర్వహించినట్లురాపూరు మండలం వేపినాపి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వి.వి.సూర్యధర్మేంద్ర తెలిపారు. పాఠశాలలో వున్న 628 మంది విద్యార్థులకు గాను 597 మందికి ఆప్తామాలిక్ ఆఫీసర్ గురవయ్య కంటి పరిక్షలను నిర్వహించారన్నారు. ఈ పరిక్షలలో 40 మంది విద్యార్థినీలకు దృష్టి లోపం వున్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. త్వరలో వీరందరికి రాష్ట్ర ప్రభుత్వం తరపున ఉచితంగా కంటి అద్దాలు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. మండలంలోని ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలల్లో 5వ తరగతి నుండి 10వ తరగతి వరకు చదువుతున్న ప్రతి విద్యార్థికి కంటి పరిక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కంటి వెలుగు కార్యక్రమం ఏడు నెలల పాటు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు,పిహెచ్‌సి సిబ్బంది హెల్త్ సూపర్‌వైజర్ పోలు కిశోర్ కుమార్, ఆరోగ్య కార్యకర్త ఎం.బి. లక్ష్మి, గురుకుల ఆరోగ్య కార్యకర్త గౌరి, హెల్త్ అసిస్టెంట్లు సుధాకర్, రత్నయ్య, ఆశా కార్యకర్తలు లక్ష్మమ్మ, అమరావతి తదితరులున్నారు.



## పొలం పిలుస్తోందిలో రైతులకు శాస్త్రీయ సాగుపై అవగాహన

**ఆదూరుపల్లి(రాపూరు),జులై15ప్రభాతవార్త :** రాపూరు మండలంలోని ఆదూరుపల్లి గ్రామంలో బుదవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో బాగంగా రైతులకు శాస్త్రీయ సాగుపై అవగాహన కల్పించారు. పొదలకూరు వ్యవసాయ సంచాలకులు కె.శివ నాయక్ ఈ కార్యక్రమంలో రైతులకు పంటల శాస్త్రీయ యాజమాన్యంపై అవగాహన కల్పించారు. వరిపంటతో పాటు ఇతర పంటల్లో వచ్చే వివిధ రకాల తెగుళ్ళు, వాటిని ముందస్తుగా గుర్తించే విధానాలు, సమర్ధవంతమైన నివారణా చర్యల గురించి వివరించారు. ఎరువుల సమతుల్య వినియోగం, పంటల దిగుబడిని పెంచే ఆధునిక సాగు విధానాలపై రైతులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సోమసుందర్,పలువురు రైతులు పాల్గొన్నారు.



## ఘనంగా లిటిల్ ఏంజెల్స్ పాఠశాలలో ఇన్వెస్టిచర్ సెరిమనీ




**గూడూరు రూరల్, జూలై 15, ప్రభాతవార్త :** గూడూరు రూరల్ పరిధిలోని శారదా నగర్లో ఉన్న లిటిల్ ఏంజెల్స్ పబ్లిక్ పాఠశాలలో బుధవారం ఇన్వెస్టిచర్ సెరిమనీ ఘనంగా బుధవారం నిర్వహించారు. క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, బాధ్యతా యుత భావనను విద్యార్థుల్లో పెంపొ ందించే లక్ష్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమం ప్రారంభంలో ఎస్సై చేతుల మీదుగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, జాతీయ గీతాలాపన నిర్వహించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రూరల్ సబ్ ఇన్స్పెక్టర్ కె. తిరుపతయ్యకు పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థి నాయకులు, హౌస్ కెప్టెన్లు, వైస్ కెప్టెన్లు, ప్రిఫెక్ట్లు తదితర బాధ్యతలను స్వీకరించిన విద్యార్థులకు బ్యాడ్జీలు, సాష్లు అందజేసి అధికారికంగా బాధ్యతలు అప్పగించారు. విద్యార్థి నాయకులు తమ విధులను నిబద్ధతతో, క్రమశిక్షణతో నిర్వహిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ కె. తిరుపతయ్య మాట్లాడుతూ నాయకత్వం అంటే కేవలం పదవి కాదని బాధ్యత అని పేర్కొన్నారు. మంచి నాయకుడు తనతో పాటు ఇతరులను ముందుకు నడిపించే వ్యక్తి కావాలని, విద్యార్థులు నిజాయితీ, క్రమశిక్షణ, సేవా భావాన్ని అలవర్చుకోవాలని సూచించారు. పాఠశాల దశలోనే నాయకత్వ లక్షణాలను పెంపొందించుకుంటే భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని అన్నారు. చదువుతో పాటు నైతిక విలువలు, దేశభక్తి, సామాజిక బాధ్యతలను కూడా అలవరుచుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బుస్సా రెడ్డి శ్రీకాంత్ రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ సుధేష్ణ, ప్రిన్సిపాల్ నమశివాయ, హెడ్ మాస్టర్ సురేష్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పేద విద్యార్థులకు ఉచితంగా ట్యూషన్ చెప్పడమే లక్ష్యం



**కావలి, జులై 15 ప్రభాతవార్త :** పట్టణంలోని సంయుక్త సేవాసంస్థచే 100మంది పేద విద్యార్థులకు ట్యూషన్ను ఉచితంగా చెప్పాలన్నదే తమ లక్ష్యంగా పనిచేస్తున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షులు సురేంద్ర బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ గత ఏడేళ్ళుగా దాతల సాయంతో పేద విద్యార్థులకు ఉచితంగా ట్యూషన్ తరగతులు నిర్వహించడం జరుగుతోందని తెలిపారు. ఇప్పటివరకు 60మందికి పైగా విద్యార్థులు మాసంస్థలో ఈఉచిత ట్యూషన్ సౌకర్యం పొందుతున్నట్లుతెలిపారు. దాతలుమోహన్, పరమేశ్వరి, చంద్రశేఖర్, లక్ష్మిప్రసన్న ,క్రిష్ణకిశోర్, అనూష, వాకాటి మహేంద్ర, శ్రీదేవి, జ్యోతి ప్రసాద్, మేఘన శ్రీయోగిని పిఐ.జాఫర్ఖాన్, అంజాద్ అలీ, పి.సీతాలక్ష్మి కళ్యాణి, శివప్రసాద్రెడ్డి, ప్రమీలారాణి, వాంతివర్ధన్, షేక్ దిల్షాద్, సాయితేలజకు కృతజ్ఞతలు తెలిపారు.

## బాలల ఆరోగ్యానికి నిండైన భరోసా

**- డాక్టర్ నాగరాజు**



**కోట, జులై 15 ప్రభాతవార్త :** నేటి బాలలే రేపటి పౌరులు. వారు ఆరోగ్యంగా ఉంటేనే రేపటి తరం ప్రగతిపథంలో పయనిస్తుంది. బాలల ఆరోగ్యానికి భరోసా ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకుంటుంది. ఆర్బిఎస్కె జాతీయ ఆరోగ్యమిషన్ ఆధ్వర్యంలో బాలలకు ఈ నెల 15వ తేదీ నుంచి సమగ్ర ఆరోగ్య పరీక్షలు నిర్వహించేందుకు రంగం సిద్ధం చేసింది. జిల్లాలోని ప్రభుత్వ ,ఎయిడెడ్ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లోని బాలల వద్దకు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది వెళ్లి పరీక్షలు చేస్తారు. 18 ఏళ్ల లోపు వారిలో జన్యుపరమైన, పోషకాహార లోపాలు, వ్యాధులు, రక్తహీనత, ఎదుగుదల సమస్య, తదితర 38 రకాల రుగ్మతలను గుర్తించేలా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు చిట్టేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి నాగరాజు చెప్పారు. రెండు దశల్లో స్క్రీనింగ్ నిర్వహిస్తారని, మొదటి దశలో వైద్య సిబ్బంది పిల్లలను పరీక్షించి అనుమానిత కేసులను గుర్తిస్తారు. వైద్యాధికారులు నిర్ధారణ పరీక్షలు నిర్వహించి చికిత్స అవసరమైన వారికి సిహెచ్సిలో, జిల్లాస్థాయిలో వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. ఎఎన్ఎంలు, మిడ్లెవల్ హెల్త్ ప్రొవైడర్లు, ఆశా కార్యకర్తలు కలిసి ప్రతి పాఠశాల, అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లలకు ప్రాథమక ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారని డాక్టర్ నాగరాజు తెలిపారు.

## మన డబ్బులు, మన లెక్కలపై శిక్షణా కార్యక్రమం



**కావలి, జులై 15 ప్రభాతవార్త :** ఎస్పి, ఎస్ఆర్ నెల్లూరు జిల్లా మెప్మా పీడి ఆదేశాల మేరకు మెప్మా ఏడి అధికారి సుధాకర్ పర్యవేక్షణలో బి.అంకయ్య నిర్వహణలో స్థానిక మున్సిపల్ సమావేశపు మందిరంలో బుధవారం ఎస్ఎల్ఎఫ్ ఆర్పీలకు మన డబ్బులు, మన లెక్కలపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణలో మెప్మా సిఎంఎం భారతి మాట్లాడుతూ పొదుపుసంఘాల సభ్యులందరికి పూర్తి అవగాహన కల్పించాలని తెలిపారు. ఎస్ఎల్ఎఫ్ల వారీగా ఆర్పీలు సమావేశాలు ఏర్పాటు చేసి అవగాహన ర్యాలీలు నిర్వహించాలని సూచించారు. ఈ ర్యాలీల్లో పొదుపు సభ్యులు పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. స్వయంసహాయక సంఘాల స్థాయిలో కూడా శిక్షణకార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. విస్తృతంగా శిక్షణా కార్యక్రమాలు నిర్వహించి పొదుపు, ఆర్థిక లావాదేవీలు నిర్వహణ లెక్కల నిర్వహణపై సభ్యులకు స్పష్టమైన అవగాహన కల్పించాలని కోరారు. ఈకార్యక్రమంలో మెప్మా ఏఓ సుధాకర్, సిఓలు కొండయ్య ఆరుణకుమారి, ప్రసన్న టిఎల్ఎఫ్, ఓబిలు సుభాషిణి, మౌనిక, టిఎల్ఎఫ్, ఎస్ఎల్ఎఫ్, ఆర్పీలు పాల్గొన్నారు.

## వ్యక్తిగత ప్రమాద భీమా పాలసీలపై అవగాహన



**వింజమూరు, జూలై 15, ప్రభాతవార్త :** ప్రజలకు ఆర్థిక భద్రత కల్పించేందుకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వింజమూరు ఏడిబీ శాఖ ఆధ్వర్యంలో వ్యక్తిగత ప్రమాద భీమా పాలసీలపై బ్రాంచ్ మేనేజర్ ఎస్ చంద్ర అవగాహన కార్యక్రమం నిర్వ హించారు. వింజమూరు పట్టణంలోని పలు దుకా ణాలలో కార్పెంటర్ షాపులు, వెల్డింగ్ షాపులు, ఎరువులు దుకాణాలలో పనిచేస్తున్న వారిని కలిసి ఎస్బిఐ జనరల్ ఇన్సూరెన్స్ సహకారంతో అందిస్తున్న ఈ పాలసీలలో రోడ్డు ప్రమాదం కరెంట్ షాక్ పిడుగు, భూకంపం, పాముకాటు వంటి వాటి వల్ల జరిగే అంగవైకల్యం, బెడ్ రెస్ట్ చార్జీలు, అంత్యక్రియల ఖర్చులు లాంటి క్రైమ్లు ఇన్సూరెన్స్ కల్పిస్తుంది అన్నారు. ఒక సంవత్సరానికి 500 రూపాయలు ప్రీమియం చెల్లిస్తే 10 లక్షలు బీమా పొంద వచ్చు అన్నారు. అలాగే సంవత్సరానికి 1000 ప్రీమియం చెల్లిస్తే 20 లక్షలు సంవత్సరానికి 2000 ప్రీమి యం చెల్లిస్తే 40 లక్షలు సంవత్సరానికి 3,000 చెల్లిస్తే 60 లక్షల ప్రమాద భీమాను పొందవచ్చు అన్నారు. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు ఒక కుటుంబం రోడ్డుమీద పడినట్టే అనే నినాదంతో ఎస్బిఐ ఈ పాలసీని ప్రజలకు అందుబాటులోకి ఇచ్చిందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ ప్రీమియం చెల్లించి ప్రమాదం జరిగిన వెంటనే ఇన్సూరెన్స్ పొందవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## మండల తెలుగుదేశం పార్టీ సమావేశం



**వింజమూరు, జూలై 15, ప్రభాతవార్త :** వింజమూరు మండల తెలుగుదేశం పార్టీ సమావేశం బుధవారం స్థానిక ఎస్వీ కన్వెన్షన్ ఆవరణలో నిర్వహించారు. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆదేశాల మేరకు మండల కన్వీనర్ గూడా నర్సా రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ సం దర్భంగా మండలంలోని పలు పంచాయతీలలో ఉన్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు కృషి చేసే విధంగా పలు తీర్మానాలను చేశారు. వాటిలో ముఖ్యంగా మండలంలోని కాటేపల్లి పంచాయతీ తమీదపాడు గ్రామంలో పైపులైను సమస్యను పరిష్కరించేందుకు తీర్మానం అదేవిధంగా డ్రైనేజీ సమస్యలను పరిష్కరించే తీర్మానం వింజమూరు అభివృద్ధి పనుల్లో భాగంగా సిసి రోడ్లు డ్రైనేజీ ఏర్పాటు తదితర కార్యక్రమాలకు 80 లక్షలతో ప్రతిపాదనలు పంపి నట్లు తీర్మానాలను చేశారు. ఈ తీర్మానాలను ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిం చేందుకు కృషి చేస్తామ న్నారు. పట్టణ అధ్యక్షులు గురజాల గోపి, ఎంఎస్నాయుడు, చల్లాశ్రీనివాసులు యాదవ్, చేబ్రోలువసంతరావు, కొండ పల్లి వెంకటేశ్వర నాయుడు, కంచర్ల శ్రీనివాసులు, అంచూరి శ్రీనివాసులు ,ఎన్నపల్లి పెంచలరావు, ఎన్ రాయుడు, చిలకలవెంకటరెడ్డి, కోడూరు నాగిరెడ్డి, గంగపట్ల వెంగయ్య, కొండ పల్లి వెంకటేశ్వర్లు, గూడా నవీన్, అబ్దుల్నబి, మంద సుజాత, కటకం ప్రసన్నకుమార్, గురజాలవాసు, గున్నం శ్రీనివాసులు రెడ్డి, ఏగినేని శ్రీనివాసులు నాయుడు, షేక్ రఫీ, ఇతర నాయకులు తదితరులు ఉన్నారు.

## ముద్రగడ మృతి పట్ల రామిశెట్టి సంతాపం

**బిట్రగుంట జూలై 15 ప్రభాతవార్త :** కాపు ఉద్యమ నేత మాజీమంత్రి ముద్రగడ పద్మనాభం మృతి పట్ల రామిశెట్టి వెంకట సుబ్బారావు చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ రామిశెట్టి వెంకట సుబ్బారావు, రాష్ట్ర యువకాపునాడు మహిళా అధ్యక్షురాలు మెతుకు రాజేశ్వరిలు వేరువేరు ప్రకటనలలో సంతాపం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాపు తెలగ, బలిజ ఒంటరి కులాలకు వారి హక్కుల కోసం పోరాడిన యోధుడి మరణం ఉద్యమానికి తీవ్రమైన లోటు అన్నారు. ముద్రగడ పద్మనాభం మృతి కాపు ఉద్యమానికి తీవ్రమైన లోటు అన్నారు. కాపు కార్పొరేషన్ ఏర్పాటుతోపాటు కాపు విద్యార్థులకు స్కాలర్షిప్ లు సాధించడంలో అవిరల కృషి చేశారన్నారు. పదవుల కోసం నేటి రాజకీయ నాయకుల మాదిరిగా పోటీ పడకుండా తమ జాతి హక్కుల కోసం ప్రాణాలకు సైతం లెక్కపెట్టకుండా ఉద్యమాలు చేపట్టి చరిత్రలోనే నిలిచిపోయారని వారు ప్రశంసించారు. అటువంటి మహనీయుడు మృతిపట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## ఉదయగిరి ప్రభుత్వ కళాశాల నందు సైబర్ నేరాల పట్ల విద్యార్థులకు అవగాహన



**ఉదయగిరి, జులై 15, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉదయగిరి లోని ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక ఉదయగిరి ఆల్తూరి రామిరెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు విద్యార్థులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ ఉసర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అవగాహన పెంచుకొని మరింత అప్రమత్తంగా ఉండాలని, సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానం పట్ల విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా సబ్ ఇన్స్పెక్టర్ బి.మహేంద్ర హాజరై విద్యార్థులకు సోషల్ మీడియా వల్ల కలిగే దుష్పరిణామాలు, ర్యాగింగ్, మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాల గురించి విద్యార్థులకు చక్కగా వివరించారు. క్రమశిక్షణ, నిజాయితీ విద్యార్థి జీవితంలో అవలంభించుకొని భవిష్యత్తులో మంచి పౌరులుగా దేశానికి సేవ చేయాలని ఆయన తెలియజేశారు. ఆర్థిక అక్షరస్యాత కేంద్రం నిర్వాహకులైన రామ్మోహన్ మాట్లాడుతూ అవాంచిత సెల్ ఫోన్ యాప్ల పట్ల జాగ్రత్త వహించి ఆర్థిక మోసాలకు గురి కాకుండా విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి ఆర్థిక అక్షరాస్యత కేంద్రం సిబ్బంది, కళాశాల అధ్యాపక బృందం, ఆఫీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## చిన్నారులకు విద్యతోనే బంగారు భవిష్యత్తు



**కావలి, జులై 15 ప్రభాతవార్త :** చిన్నారులకు విద్యతోనే బంగారు భవిష్యత్తు అని డాక్టర్ రామ్సెంటర్ డైరెక్టర్ కూనం తాతిరెడ్డి తెలిపారు. డాక్టర్ రామ్ సెంటర్ విశ్వోదయ ఆధ్వర్యంలో బుధవారం గాయత్రి నగర్, జొన్నాయికుంట, ఇస్లాంపేట మూడు అంగన్వాడీ కేంద్రాలలోని చిన్నారులకు విద్యాసామాగ్రి, గర్భవతు లకు, బాలింతలకు ఐరన్ టానిక్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కూనం తాతిరెడ్డి మాట్లాడుతూ చిన్నారులకు విద్యతోనే బంగారు భవిష్యత్తు అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను బాగా చదివించాలని బాలలుందరూ బడిలో ఉండాలన్నారు. పనిలో కాదన్నారు. బాలకార్మిక వ్యవస్థను రూపుమాపాలన్నారు. ఎం.మాలకొండారెడ్డి మాట్లాడుతూ ఆడ, మగ శిశువుల మధ్య వివక్షత చూపరాదని తెలిపారు. అనంతరం గర్భవతులకు, బాలింతలకు రక్తహీనతపై అవగాహన కల్పించారు. అంగన్వాడీ కేంద్రాల టీచర్లు అరుణ, శ్యామల, చిన్నారుల తల్లిదండ్రులు, గర్భవతులు, బాలింతలు పాల్గొన్నారు.

## ఎంఈఓ 2గా ఎం. వెంకటేశ్వర్లు బాధ్యతల స్వీకరణ



**వింజమూరు, జూలై 15, ప్రభాతవార్త :** వింజమూరు మండల విద్యాధికారి 2గా ఎం. వెంకటేశ్వర్లు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మండల విద్యాశాఖ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంఈఓ 1 నుండి బాధ్యతలు అందుకున్న అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని ప్రభుత్వ, జెడ్పీ, మండల పరిషత్ పాఠశాలల పనితీరును క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తానని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా ఉపాధ్యాయులకు అవసరమైన సూచనలు, సలహాలు అందజేస్తూ పాఠశాలలను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. విద్యార్థుల డ్రాప్అవుట్స్ తగ్గించడం, పోటీ పరీక్షల్లో విజయాలు సాధించేలా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టడం, డిజిటల్ విద్యను ప్రోత్సహించడం తన ప్రధాన ప్రాధాన్యతలుగా ఉంటాయని పేర్కొన్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, మధ్యాహ్న భోజన పథకం, విద్యా కార్యక్రమాల అమలులో ఎలాంటి లోపాలు లేకుండా చూస్తానని హామీ ఇచ్చారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రుల సహకారంతో మండలంలో విద్యా ప్రమాణాలను మరింత పెంచుతామని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ 1 పి రమేష్, విద్యాశాఖ సిబ్బంది మౌనిక ధర్మారెడ్డి, శ్రీహరి పాల్గొని నూతన ఎంఈఓకు శుభాకాంక్షలు తెలిపారు.

## రమణమూర్తిపై దాడిచేసిన కశ్యవ్రెడ్డిని కఠినంగా శిక్షించాలి




**కావలి, జులై 15 ప్రభాతవార్త :** ఓ న్యూస్ చానల్ చర్చావేదికలో విజయం విహారం రమణమూర్తిపై చెప్పుతో భౌతికంగా దాడిచేసిన మతోన్మాది కేశ్యవ్రెడ్డిని కఠినంగా శిక్షించాలని సిపిఐ సీనియర్ నాయకులు పురుషోత్తం కో రారు. పట్టణ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాటాలడుతూ పరిపాలనలో రాజకీయాలకు మతాన్ని వాడకూడదన్న రమణమూర్తిపై కశ్యవ్రెడ్డి దాడికి తెగబడడం దారుణం అన్నారు. బిన్నాభిప్రాయాలు ఉన్నప్పుడు చర్చించి వాటిని ఎదుర్కొవాలి తప్పా అనాగరిక పద్ధతుల్లో అవమానకరంగా వ్యాఖ్యలు చేస్తూ దాడిచేయడం బావ క్రటన స్వచ్ఛపై జరిగిన దాడిగా అభివర్ణించారు. పిఎం హైదారాబాద్ పర్యటన సందర్భంగా పత్రికల్లో వచ్చిన ప్రకటనలు శ్రీక్రిష్ణుడు తల తొలగించి ఆ స్థానంలో మోడీ బొమ్మ వచ్చేటట్లు చేయడాన్ని ప్రజలంతా వీక్షించారని హిందూదర్మంపై ఏ మాత్రం గౌరవం లేని సంస్థ ఆర్ఎస్ఎష్ అన్నారు. ఈ ప్రశ్నను సహించలేని ఆర్ఎస్ఎస్ గుండాలు బౌతిక దాడులకు దిగుతున్నారని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. బౌతిక దాడులకు పాల్పడిన కశ్యవ్రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకొని కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ డివిజన్ కార్యదర్శి దమ్ము దుర్గాబాబు, సీనియర్ నాయకులు చేవూరు కొండయ్యలు పాల్గొన్నారు.

## గ్రంధాలయానికి ర్యాక్లను బహూకరించిన కంచి పరమేశ్వర్ రెడ్డి



**ఆత్మకూరు, జూలై 15ప్రభాతవార్త :** ఆత్మకూరు శాఖా గ్రంథాలయానికి నిత్యాన్నదాత శ్రీ సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శ్రీ కంచి పరమేశ్వర్ రెడ్డి 40 వేల రూపాయల విలువైన" 4 "బుక్ ర్యాక్స్ లను ఇన్చార్జి లైబ్రేరియన్ ఓ.శ్రీనివాసరాజుకు అందజేశారు. అనంతరం గ్రంథాలయంలోని పుస్తకాలను గురించి పాఠకులకు అందిస్తున్న సేవలు గురించి లైబ్రేరియన్ ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు తమ ఉపన్యాసంలో గ్రంథాలయం విశాలమైన భవనంలో మౌలిక వసతులతో పాఠకులకు సౌకర్యవంతంగా ఉన్నదని గ్రంథాలయ సేవలను విద్యార్థులు ,పుర ప్రజలు వినియోగించుకొని విజ్ఞానాన్ని పొందాలని సూచించారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన పుర ప్రముఖులు, పాఠకులు గ్రంథాలయంతో వారికున్న అనుబంధాన్ని గురించి గుర్తు చేసుకున్నారు .

## నేడు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి పర్యటన



**కొడవలూరు, జూలై 15 ప్రభాతవార్త:** కొడవలూరు మండలంలోని నాయుడుపాలెం పంచాయతీలో గురువారం సాయంత్రం 4:30 గంటలకు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి బీటీ, సీసీ రోడ్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారని కొడవలూరు టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు నాపా వెంకటేశ్వరనాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## రాచర్లపాడు హైవే పక్కన గుర్తు తెలియని వ్యక్తి మృతి



**కొడవలూరు, జూలై 15 ప్రభాతవార్త:** కొడవలూరు మండలం రాచర్లపాడు గ్రామం సమీపంలోని జాతీయ రహదారి పక్కన చెట్టు కింద గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మృతుడు హిందీ మాట్లాడే వ్యక్తిగా పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడి వివరాలు తెలిసిన వారు కొడవలూరు పోలీసులను సంప్రదించి సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

## స్వల్పకాలిక పంటలను సాగు చేయాలి

**- వ్యవసాయాధికారి సుచేంద్రప్రసాద్**



**కోట, జూలై 15 ప్రభాతవార్త :** ఎల్నినో ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో రైతులు స్వల్పకాలిక పంటలను సాగు చేసుకోవాలని కోట మండల వ్యవసాయాధికారి సుచేంద్ర ప్రసాద్ సూచించారు. బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మండల పరిధిలోని వంజివాక, కొక్కుపాడు గ్రామాల్లో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ఎల్నినో ప్రభావం చాలా ఎక్కువగా ఉంటుందన్నారు. రైతులు తగు జాగ్రత్తలతో నీటిపై ఆధారపడే దీర్ఘకాలిక పంటలను కాకుండా తక్కువ కాల వ్యవధిలో లాభాలు తెచ్చే పంటలను వేసుకోవాలన్నారు. ఖరీఫ్లో సాగు చేసిన పంటలకు పంట నమోదు చేయించుకోవాలన్నారు. యూరియా, డిఎపి, ఇతర ఎరువులు రైతు సేవా కేంద్రాలతో పాటు ప్రైవేటు ఎరువుల దుకాణాల్లో పుష్కలంగా ఉన్నాయన్నారు. ఎపిఐఎంఎస్ యాప్ ద్వారా మాత్రమే ఎరువులను పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. మూడు దశల్లో 20 రోజులకు ఒక్కసారి మాత్రమే ఎరువులు ఇస్తారని చెప్పారు. ప్రతి రైతు తప్పనిసరిగా ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు సాయి, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆందోళనలో ఆత్మహత్య



**మనుబోలు జూలై 15 ప్రభాతవార్త :** నిందితుడు ఏడుకొండలు పోలీసు వస్తున్నారన్న విషయం తెలుసుకున్న సమాచారంతో భయాందోళనలో పోలీసులు వచ్చే సమయానికి పురుగు మందు తాగారు. ఈ సమయంలో వెళ్ళిన పోలీసులు విషయం తెలుసుకోకుండా కాలువ గట్టుపై ఉన్న ఏడుకొండలును తీసుకొని వస్తుండగా మార్గమద్యంలో ఆపస్మారక స్దిఇతికి రావడంతో గూడూరు ఏరియా ఆసుపత్రికి తీసుకుని వెళ్ళగా వైద్యులు మృతి చెందినట్లు చెప్పడంతో పోస్టుమార్టరం కోసం తరలించారు. ఈకేసు పూర్తి వివరాలు పోస్టుమార్టం నివేదిక వచ్చిన తరువాత అన్ని విషయాలు బయటకు వచ్చే అవకాశం ఉంది.

## రామలింగేశ్వర స్వామికి గత ఏడాదికంటే పెరిగిన హుండీ ఆదాయం

**– హుండీలో రూ.23.32 లక్షల ఆదాయం – గత ఏడాదితో పోలిస్తే రూ.3.48 లక్షలు అధికం**




**విడవలూరు, జూలై 15 ప్రభాతవార్త :** విడవలూరు మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలో వెలసిన శ్రీ రామలింగేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించి బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు ఆలయ అర్చకులు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాల అనంతరం నిర్వహించిన హుండీ లెక్కింపులో స్వామివారికి భక్తులు సమర్పించిన కానుకల ద్వారా రూ.23,32,342 ఆదాయం సమకూరింది. గత ఏడాదిలో రూ.19,84,322 ఆదాయం రాగా, ఈ ఏడాది రూ.3,48,020 అధికంగా వచ్చినట్లు ఆలయ నిర్వహణ అధికారి బి. మల్లికార్జున్ రెడ్డి తెలిపారు. భక్తుల రద్దీ పెరగడంతోనే హుండీ ఆదాయం కూడా పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు పేరేపి శ్రీకాంత్ శర్మ, శ్రీనివాస్ శర్మ, జూనియర్ అసిస్టెంట్ బెల్లంకొండ వెంకటేశ్వర్లు, ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## పంట నమోదు చేసుకోవాలని రైతులకు సూచన

**- ఏ డి ఏ అనిత**



**విడవలూరు, జూలై 15 ప్రభాతవార్త :** విడవలూరు మండలంలోని అన్నారెడ్డిపాలెం, ముదివర్తి గ్రామాల్లో బుధవారం కోవూరు వ్యవసాయ సహాయ సంచాలకురాలు అనిత ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంద్ది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు తప్పనిసరిగా ఈపంట నమోదు చేసుకోవాలని ఆమె సూచించారు. అనంతరం ముదివర్తి గ్రామంలోని ఛాంపియన్ రైతుల పొలాలను పరిశీలించి, సోలార్ ట్రాప్పు, లింగా కర్షణ బుట్టల్లో చిక్కిన కీటకాల ఉధృతిని పరిశీలించారు. జొన్న, సజ్జ వంటి రక్షక పంటల సాగు ప్రయోజనాలను వివరించారు. మండలంలోని అన్ని ఆర్బీకేల్లో పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగు, జనుము, పిల్లిపెసర విత్తనాలు 50 శాతం రాయితీపై అందుబాటులో ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సీహెచ్ఎస్ లక్ష్మీ, వీఏఏలు శ్రావ్య, కవిత, వెన్నెల పాల్గొన్నారు.

## సూక్ష్మపోషకాలతో భూసారాన్ని ఘననీయంగా పెంచవచ్చు



**కోవూరు, జూలై 15 ప్రభాతవార్త :** సూక్ష్మ పోషకాలు ఉపయోగించి భూమి సారాన్ని ఘననీయంగా పెంచవచ్చని మండల వ్యవసాయాధికారిణి టి. రజని తెలిపారు. కోవూరు మండలం చెర్లోపాలెం, లేగుంటపాడు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. సేంద్రియ ఎరువులు అయిన పచ్చిరొట్ట విత్తనాలు వాడడం వలన భూసారాన్ని పెంచేందుకు అవకాశం ఉందన్నారు. ప్రతి రైతు వ్యవసాయ శాఖ సిఫార్సు చేసిన మోతాదులోనే ఎరువులు వాడుకోవాలన్నారు. ముఖ్యంగా వ్యవసాయం సాగు చేసే ప్రతి రైతు విధిగా ఈ పంటను నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో శిరీష, గ్రామ వ్యవసాయ సహాయకులు మెహర్నిసా, కీర్తన, తదితరులు ఉన్నారు.

## దేవాలయంలో పెద్దఎత్తున అన్నదానం



**కోవూరు, జూలై 15 ప్రభాతవార్త :** టీడీపీ ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లు మాతృమూర్తి ఆది లక్ష్మమ్మ పదవ వర్ధంతి సందర్భంగా కోవూరులో వెలసి ఉన్న శ్రీ దక్షిణాముఖ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో బుధవారం పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు, తదితరులు ఉన్నారు.

## వినూత్న రంగాలపై అవగాహన అవసరం





**కోవూరు, జూలై 15 ప్రభాతవార్త :** ప్రాథమిక దశ నుంచి ప్రతి విద్యార్థి తమలో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేలా తమ పాఠశాల ప్రత్యేక దృష్టి సారించిందని ప్రధానోపాధ్యాయిని సోఫియా కిరణ్మయి అన్నారు. బుధవారం వరల్డ్ యూత్ స్కిల్ డే సందర్భంగా సమావేశ మందిరంలో ఫుడ్ ప్రాసెసింగ్ , ఐటీ రంగాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అనేక వినూత్న అంశాలను తయారు చేసి ఉపాధ్యాయుల మన్ననలు పొందారు. ఆమె మాట్లాడుతూ తమ పాఠశాలలో ప్రత్యేకంగా ఫుడ్ ప్రాసెసింగ్, బ్యూటీ వెల్నెస్, ఐటీ రంగాలపై విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందిసు_్తన్నామన్నారు. కేవలం చదువే కాకుండా ఇటువంటి అంశాలపై వారు దృష్టి సారిస్తే భవిష్యత్తులో వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఇటువంటి అంశాలను వెలికి తీసేలా ఉపాధ్యాయులు నరేష్, శ్రావణి, తదితరులు ప్రత్యేక చొరవ చూపుతున్నారని, ఇందుకు వారిని ప్రత్యేకంగా అభినం దిస్తున్నామ న్నారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయినిని ప్రత్యేకంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

## అంగన్వాడీ కేంద్రానికి చింతలపల్లి దంపతుల భూరి విరాళం



**మర్రిపాడు, జూలై 15 ప్రభాతవార్త :** మర్రిపాడు మండలం డిసిపల్లిలోని మెయిన్ అంగన్వాడీ కేం ద్రానికి అదే గ్రామానికి చెందిన చింతలపల్లి మధుసూదన శాస్త్రి వాణి దంపతులు తమ అమ్మా నాన్నా ఫౌండేషన్ ద్వారా చింత లపల్లి లక్ష్మీనరసయ్య, నాగమణి దంపతుల జ్ఞాపకార్థం భూరి విరాళంతో అంగన్వాడీ కేంద్రా నికి గ్రిల్స్ ఏర్పాటు చేసి పెయింటింగ్ వేయించి ఆట వస్తువులు, కుర్చీలు కూడా సమకూర్చారు. అదే గ్రామానికి చెందిన పాశర్లపూడి వెంకటేశ్వర్లు చిన్నారులకు పలకలు, ప్లేట్లు, గ్లాసులు విరాళంగా అందజేసి పంపిణీ చేశారు. విరాళం ఇచ్చిన దాతలకు ఐసీడీ ఎస్ సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం జరిగిన అనంతసాగరం ఐసిడిఎస్ సిడిపిఓ సెర్మిస్టా, సూపర్వైజర్ నారాయణమ్మ, ఎంపిడివో నాగేశ్వర్ రావు, ఎం ఈ వో తిరుపతయ్య, స్కూల్ హెడ్మాస్టర్, అంగన్వాడీ కార్యకర్త సుజాత, దాతలు మధుసూదన్ శర్మ, వాణి, వెంకటేశ్వర్లు, గ్రామస్తులు వెంగళరెడ్డి పలువురు మహిళలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

## మైనర్ బాలికపై లైంగిక దాడి

**అల్లూరు, జులై 15 ప్రభాతవార్త :** అల్లూరు మండలపరిధిలోని గాలిదిబ్బలు గ్రామంలో బుధవారం మైనర్ బాలికపై లైంగిక దాడి జరిగిన సంఘటన చోటు చేసుకొంది. అల్లూరు ఎస్ఐ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ యాటగిరి చాన్బాషా(45) అదే గ్రామానికి చెందిన మైనర్ బాలికపై లైంగిక దాడి ఘటనపై ముద్దాయిని అరెస్టు చేసి రిమాండ్కు పంపి పోక్సో చట్టం కింద కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు.

అపోలో హాస్పిటల్‌లో

## తక్కువ ఖర్చుతో ప్లాస్టిక్ సర్జరీలు : వైద్యుల వెల్లడి

- ప్రపంచ ప్లాస్టిక్ సర్జరి దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు
- ప్లాస్టిక్ సర్జరి, కాస్మోటిక్ సర్జరి విధానాలకు తేడా ఏమిటి ?
- కాస్మోటిక్ సర్జరీలు ఖరీదైనవా ?
- వెల్లడించిన ప్రముఖ సీనియర్ కన్సల్టెంట్, ప్లాస్టిక్, కాస్మోటిక్ సర్జన్ డాక్టర్ పావులూరి



**నెల్లూరు, జూలై 15, ప్రభాతవార్త – వైద్యం** ప్రతీ సంవత్సరం జూలై 15న ప్రపంచ ప్లాస్టిక్ సర్జరీ దినోత్సవం నిర్వహించబడుతుందని ప్రముఖ సీనియర్ కన్సల్టెంట్, ప్లాస్టిక్, కాస్మోటిక్ సర్జన్ డాక్టర్ పావులూరి తెలిపారు. బుధవారం ప్లాస్టిక్, పునర్నిర్మాణ శస్త్ర చికిత్స ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన పెంచడానికి జరుపుకుంటారు. నెల్లూరు అపోలో స్పెషాలిటీ హాస్పిట ల్‌లో కూడా బుధవారం ప్రపంచ ప్లాస్టిక్ సర్జరి దినోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా హాస్పిటల్ సీనియర్ ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ పావులూరి శ్రీనివాస రావు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం జరిగింది. డైరెక్టర్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరామ్ సతీష్, యూనిట్ హెడ్ విశ్వేశ్వర్ రెడ్డి తో కలిసి డాక్టర్ పావులూరి శ్రీనివాస రావు ప్లాస్టిక్ సర్జరీ మరియు కాస్మోటిక్ సర్జరీలపై అవగాహన కల్పించారు.

**– ప్లాస్టిక్, రీకన్ స్ట్రక్టివ్ సర్జరీ** ప్లాస్టిక్ సర్జరీ అనగానే చాలా మందికి ఇది అందాన్ని మెరుగుపరుచుకొనే ఆపరేషన్ గానే అవగాహన ఉం టుంది. కానీ నిజానికి ప్లాస్టిక్ సర్జరీలో ముఖ్యంగా రెండు ఉప విభాగాలు ఉంటాయి. అందులో ఒకటి రీ కన్ స్ట్రక్టివ్ సర్జరీ, రెండవది కాస్మోటికి సర్జరీ. రీకన్ స్ట్రక్టివ్ సర్జరీ అంటే.. మన శరీరంలో ఏదైనా భాగాన్ని పునర్నిర్మాణం చేసే శస్త్ర చికిత్సా విధానాన్ని రీకన్ స్ట్రక్టివ్ సర్జరీ అంటారు. ముఖ్యంగా యాక్సిడెంట్ కావడం వల్ల, పుట్టుకతోనే లేకపోవడం వల్ల, కాలిన తరువాత , క్యాన్సర్ కారణంగా తొలగించడం వల్ల కలిగే లోపాలను తిరిగి పునర్మిర్మాణం చేసే విధానాన్ని రీ కన్ స్ట్రక్టివ్ సర్జరీ అంటాము. ఈ పునర్నిర్మాణ శస్త్ర చికిత్సను మచ్చలు లేకుండా కుట్లు వేసే విధానాలు, స్కిన్ గ్రాఫ్టింగ్ విధానాలు, ఫ్లాప్ కవర్ సర్జరీ విధానాలు, మైక్రో సర్జరీ అనే అధునాతనమైన విధానాల ద్వారా చేయవచ్చునని డాక్టర్ పావులూరి వెల్లడించారు. కాస్మోటిక్ సర్జరీ అంటే కాస్మోటిక్ సర్జరీ అనేది ప్లాస్టిక్ సర్జరీలో ఒక భాగమే. ఈ విధానం ద్వారా శరీరాకృతిని అందంగా తీర్చిదిద్దవచ్చు. ఇందులో ముఖ్యంగా రెండు రకాలైన విధానాలు ఉంటాయి. మొదటిది ఆపరేషన్ చేసి శరీరాకృతిని అందంగా తీర్చిదిద్దే విధానమైతే, రెండవది ఆపరేషన్ లేకుండా చేసే విధానం. ఆపరేషన్ చేసే విధానం ద్వారా ముఖ్యంగా బట్టతలకు హెయిర్ ట్రాన్స్ ప్లాంటేషన్, ఫోర్‌హెడ్ లిఫ్ట్, బ్రో లిఫ్ట్, ఫేస్ లిఫ్ట్, నెక్ లిఫ్ట్, బ్లిఫరో ప్లాస్టీ, రైనో ప్లాస్టీ, డింపుల్ క్రియేషన్, లిప్ రిడక్షన్, లిప్ ఆగ్మెంటేషన్, ఇయర్ కరెక్షన్ సర్జరీ, బ్రెస్ట్ రిడక్షన్, బ్రెస్ట్ ఆగ్మెంటేషన్, బ్రెస్ట్ లిఫ్ట్, గైనెకోమాస్టియ (మగవారిలో ఛాతి పెరుగుదల), బ్రేకియో ప్లాస్టీ, లైపోసక్షన్, బాడీ కంటూరింగ్ సర్జరీలు, టమ్మీటక్ సర్జరీ, కాస్మోటిక్ గైనకాలజీ, డబుల్ చిన్ కరెక్షన్, జాలైన్ కరెక్షన్, ఫాట్ ఆగ్మెంటేషన్ సర్జరీ అనే శస్త్ర చికిత్సలు చేస్తారు. నాన్ సర్జికల్ కాస్మోటిక్ విధానాలు త్రెడ్ లిఫ్టింగ్ విధానము, నాన్ సర్జికల్ రైనో ప్లాస్టీ, ఫిల్లర్స్, బొటాక్స్ ఇంజెక్షన్లు, పిఆర్‌పి, జిఎఫ్‌సి, క్యూఆర్ 678, ఎక్సోజోమ్ ఇంజెక్షన్లు, ఆధునికమైన స్కిన్ బూస్టర్ ఇంజక్షన్లు, కెమికల్ పీల్స్, లేజర్ పద్ధతుల ద్వారా చికిత్సా విధానాలు ఈ కాస్మోటిక్ సర్జరీలు, నాన్ సర్జికల్ విధానాలన్నీ కూడా ఒక అనుభజ్ఞుడైన ప్లాస్టిక్ సర్జన్ చేసినట్లయితే ఏ విధమైన ఇబ్బందులు లేకుండా మీ శరీరఆకృతి అందాన్ని మెరు గుపరుచుకోవచ్చునని డాక్టర్ పావులూరి శ్రీనివాసరావు పేర్కొన్నారు.

**– లైపోసక్షన్ సర్జరీ అంటే ఏమిటి ? దాని వల్ల సైడ్ ఎఫెక్ట్స్ ఏమైనా వస్తాయా ?**

లైపోసక్షన్ అనేది శరీరంలోని కొన్ని భాగాల్లో పేరుకుపోయిన అదనపు కొవ్వును శస్త్ర చికిత్స ద్వారా తొలగించే ఒక కాస్మోటి సర్జరీ విధానం. ఈ పద్ధతి ద్వారా చిన్న కోత చేసి, కాన్యులా అనే సన్నని గొట్టాన్ని ఉపయోగించి కొవ్వును తీసివేస్తారు. ఈ విధానాన్ని ఆరోగ్యవంతమైన వారిలో అనుభవజ్ఞుడైన ప్లాస్టిక్ సర్జన్ చే, అదునాతన పరికరాలు ఉపయోగించి చేస్తే సైడ్ ఎఫెక్ట్స్ అనేవి లేకుండా శరీరాకృతిని మెరుగుపరచవచ్చు. ముఖ్యంగా లైపో సక్షన్ సర్జరీ అనేది బరువు తగ్గించే ఆపరేషన్ కాదు. సాధారణంగా ప్రజల్లో ప్లాస్టిక్ సర్జరీ అంటే ఖరీదు ఎక్కువగా ఉంటుందని అభిప్రాయం. కానీ అది నిజం కాదు. ప్లాస్టిక్ సర్జరీలో వాడే కొన్ని ఎక్విప్ మెంట్‌లు మాత్రమే ఖరీదయినవి. ఇతర సూపర్ స్పెషాలిటీ చికిత్సా విధానాలతో పోల్చి చూస్తే అంతే ధరకు ప్లాస్టిక్ సర్జరీ విధానాలు చేయవచ్చు. నెల్లూరు అపోలో స్పెషాలిటీ హాస్పిటల్ లో ఈ విధానాల ద్వారా ప్లాస్టిక్ సర్జరీ చేసే అధునాతన మిషన్లతో పాటూ అనుభవజ్ఞులైన వైద్యులు ఉన్నారని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అపోలో హాస్పిటల్ ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ పావులూరి శ్రీనివాసరావు కోరారు.

## గణేష్ ఘాట్ ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతాం

గణేష్ ఘాట్ లో నుడా పాత్ర చాలా కీలకం



**నెల్లూరు, జులై 15 ప్రభాతవార్త** గణేష్ ఘాట్ లో నిమజ్జన ఏర్పా ట్లపై విక్రమ సింహపురి గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో కలసి పరిశీలించిన రూరల్ ఎమ్మెల్యే కో టంరెడ్డి శ్రీధర్ రెడ్డి, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, నగర మేయర్ దేవరకొండ సు జాత, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి. గణేష్ ఘాట్‌ను రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఆధ్వ ర్యంలో బ్రహ్మాండంగా అభివృద్ధి చేస్తాం. నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి.గణేష్ ఘాట్‌ను నా శక్తికి మించి అభివృద్ధి చేశా. భాగ్యనగరం హైదరాబాద్ తరహాలో నెల్లూరు నగరంలో గణేష్ నిమజ్జనాన్ని నిర్వహి స్తాం. గణేష్ ఘాట్ ను రానున్న రోజుల్లో పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతాం. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి. పై కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కువ్వాకొల్లు విజయ లక్ష్మీ, విక్రమ సింహపురి గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు సురేంద్ర రెడ్డి, మండ్ల ఈశ్వరయ్య, విజయ్ కుమార్, కో క్లస్టర్ ఇంఛార్జ్ విష్ణు ప్రియ, స్థానిక తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఉచ్చూరు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## నారాయణలో ప్లాస్టిక్ సర్జరీ ఉచిత కన్సల్టేషన్ సేవలు



**నెల్లూరు,జూలై 15, ప్రభాతవార్త – వైద్యం** ప్రజలకు అత్యాధునిక ప్లాస్టిక్ రికన్స్ట్రక్టివ్ సర్జరీ సేవలను మరింత అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో నారాయణ మెడికల్ కాలేజ్ హాస్పిటల్ 2026 జూలై 15వ తేది నుండి ఆగస్టు 15 వతేది వరకు ప్రత్యేక ప్లాస్టిక్ సర్జరీ ప్యాకేజీని ప్రకటించింది. ఈ సందర్భంగా హాస్పిటల్ అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ డా హరీష్ రావులపల్లి మాట్లాడుతూ క్లిష్టమైన ప్లాస్టిక్ సర్జరీలను విజయవంతంగా నిర్వ హిస్తూ నారాయణ హాస్పిటల్లోని ప్లాస్టిక్ సర్జరీ విభాగం ఎంతో పటిష్టంగా ఉందని, డా. ఎన్టీఆర్ వైద్య సేవా పథకంలో ఉచితంగాను, ఆరోగ్య శ్రీ వర్తించని వారికి అతి తక్కువ ఖర్చుకే ప్లాస్టిక్ సర్జరీలు చేస్తున్నా మని, ప్రపంచ ప్లాస్టిక్ సర్జరీ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక ప్యాకేజీలో ప్లాస్టిక్ సర్జన్ కన్సల్టేషన్ పూర్తిగా ఉచితంగా అందించబడుతుందని, కాస్మోటిక్ సర్జరీ అవసరమైన వారికి కాస్మోటిక్ సర్జరీ ప్యాకేజీలపై 25 శాతం రాయితీ అందిస్తున్నామని తెలిపారు. ఈ సదుపాయం 2026 జూలై 15వ తేది నుండి ఆగస్టు 15వ తేది వరకు అందుబాటులో ఉంటుందని, ముందస్తు అపాయింట్మెంట్ కొరకు 9640100555 నంబరును సంప్రదించవచ్చునని లేదా నేరుగా సోమవారం నుంచి శనివారం వరకు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు నారాయణ సూపర్ స్పెషాలిటీ బ్లాక్ గ్రౌండ్ ఫ్లోర్లోని రిసెప్షన్ నందు సంప్రదించవలెనని, ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం నారాయణ హాస్పిటల్ ప్లాస్టిక్ సర్జన్ డా. ఆర్. శ్రీలక్ష్మి మాట్లాడుతూ కాస్మోటిక్ విభాగంలో జుట్టు రాలిపోయే వారికి, బట్టతల ఉన్నవారికి హెయిర్ ట్రాన్స్ ప్లాంటేషన్, ముఖం పై, కళ్లకింద ముడుతలకు బ్లెఫ్రోప్లాస్టీ, ముక్కు వంకర, ముక్కు పెద్దగా ఉంటే రైనోప్లాస్టీ, వృద్ధాప్యం కనిపించకుండా యవ్వనంగా కనిపించేందుకు ఫేస్ లిఫ్ట్ చేయడం జరుగుతుందని, అలాగే మెడపై ఉన్న ముడతలు తగ్గించేందుకు నెక్ లిఫ్ట్, గడ్డం కింద ఉన్న కొవ్వు తీసేందుకు లైపోసక్షన్, మగవారిలో రొమ్ముభాగం అసాధరణంగా పెరిగి గైనికోమాస్టియా ఉన్న వారికి సర్జరీ ద్వారా సరిచేయడం జరుగుతుంది, అలాగే ఆడవారిలో ప్రసవం తరు వాత కొంత కాలానికి బ్రెస్ట్ కిందకు జారిపోవడం జరుగుతుంది అలాంటి వారికి బ్రెస్ట్ ఆగ్మెంటేషన్ ఇం ప్లాంట్స్ పెట్టడం ద్వారా సాధారణ స్థితికి తీసుకురావడం, కింది పొట్టను తగ్గించేందుకు టమ్మీటక్ చికిత్సా పద్ధతులను కాస్మోటిక్ సర్జరీలలో చేస్తున్నామని, ప్రపంచ ప్లాస్టిక్ సర్జరీ దినోత్సవం సందర్భంగా అంది స్తున్న ఈ ప్రత్యేక ప్యాకేజీ రాయితీని అందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నారాయణ హాస్పిటల్ అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ డా. హరీష్ రావులపల్లి, ప్లాస్టిక్ సర్జన్ డా. ఆర్. శ్రీలక్ష్మి, అసిస్టెంట్ మెడికల్ సూపరింటెండెంట్ డా. సహస్రా, నారాయణ హాస్పిటల్ ఏజీఎం ఎ.సి శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి గ్రామాభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం

రూ.50లక్షల సిసిరోడ్లుకు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ శంకుస్థాపన





**కావలి, జూలై 15 ప్రభాతవార్త :** జలదంకి మండలం, చొడవరం గ్రామంలో 15వ ఆర్థిక సంఘం నిదుల కింద రూ.50లక్షలతో నిర్మించనున్న సిపి రోడ్లు శంకుస్థాపన బుధవారం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ శిలాపలకాన్ని ఆవిష్కరించి సిసిరోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ ప్రజలకు నాణ్యమైన మౌలిక వసతులు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రుల నాయకత్వంలో రాష్ట్రంలో గ్రామాల అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు. అందులో భాగంగానే చోడవరం గ్రామంలో రూ.50లక్షల వ్యయంతో సిసిరోడ్ల పనులను ప్రారంభించడం జరుగుతోందని తెలిపారు. ఈ రోడ్లు పూర్తియిన అనంతరం గ్రామ ప్రజలు ఇతర కారణాల వల్ల ఇబ్బందులు నుంచి ఉపశమనం పొదడంతో పాటు గ్రామంలో పరిశుభ్రత, రాకపోకలకు సులభతరంగా ఉంటుందన్నారు. గ్రామాలను ఆదర్శగ్రామాలుగా తీర్చేందుగా మొదటగా ఈ గ్రామాన్ని ఎంచుకొనినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కార్పొరేట్లకు తాకట్టు పెడుతున్నాయి

- ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. రామకృష్ణ




**గూడూరు, జూలై 15, ప్రభాతవార్త** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాలను కార్పొరేట్ సంస్థలకు తాకట్టు పెడుతున్నాయని ఎమ్ రామకృష్ణ విమర్శించారు. స్థానిక గూడూరు బస్టాండ్ దగ్గర ఉన్న రిటైర్డ్ ఉద్యోగుల భవనంలో ఐఎఫ్‌టియు జిల్లా మూడో మహాసభ నిర్వహించారు. ఈ మహాసభకు ముఖ్య వక్తగా హాజరైన ఐఎఫ్టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంతో తలవగ్గి 4 లేబర్ కోడ్స్ అమల్లో భాగంగా అసెంబ్లీలో పనిగంటలు పెంచుతూ తీర్మానం చేయటం కార్మికుల శ్రమను కార్పొరేట్లకు పెట్టుబడిగా మార్చడమే అని విమర్శించారు. అంగన్వాడి, మున్సిపాలిటీ, భవననిర్మాణ కార్మికులు, మిడ్ డే మీల్స్ వర్కర్లు, ఆయాలు, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులకు ఎన్నికలు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడం బాధాకరమన్నారు. రాష్ట్రంలో ఫార్మసీ తదితర ప్రైవేటు పరిశ్రమల్లో కార్మికులు ప్రమాదాలకు తరచూ గురవుతున్న వాటిపై చర్యలు నా మాత్రమే అన్నారు స్టీల్ ప్లాంట్ కడప ఉక్కు, విభజన హామీలు వాటికి సంబంధించిన బడ్జెట్ విషయంలో కూటమి ప్రభుత్వం కేంద్రాన్ని డిమాండ్ చేయడం లేదని తద్వారా ఐదు కోట్ల ఆంధ్రులు నష్టపోతున్నారని అన్నారు. మహాసభల స్వార్థ సందేశాన్ని మీ మమత ప్రగతి మహిళా సంఘం జిల్లా కన్వీనర్ డి నవకోటి, బిల్డింగ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ అరుణోదయ, రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీను సందేశాలు ఇచ్చారు. మహాసభ ప్రారంభం ముందు ఐఎఫ్టియు జెండాను చెంగలరావు ఆవిష్కరించారు. అమరవీరుల సంతాప తీర్మానం ప్రవేశపెట్టగా రెండు నిమిషాల మౌనం పాటించారు. అనంతరం కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టగా సభ ఆమోదం తెలిపింది. అనంతరం మహాసభ 11 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా డిపి. పోలయ్య, కార్యదర్శిగా డి. నవకోటి, కోశాధికారిగా శ్రీనివాసులు కార్యవర్గ సభ్యులుగా కృష్ణయ్య, అనిల్, రత్నయ్య, పోలయ్య, వెంకటరమణ, కే సుధాకర్, వెంకటేశ్వర్లు మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం పలు తీర్మానాలను సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై వచ్చే సోమవారం ధర్నా చేయాలని మహాసభ పిలుపునిచ్చారు.

## టిడిపి నేత మధుసూదన్ రెడ్డిని పరామర్శించిన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంత్ రెడ్డి



**ఇందుకూరుపేట, జూలై 15, ప్రభాతవార్త:** మండలం నిడుముసలి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత దువ్వూరు మధుసూదన్ రెడ్డిని కోవూరు శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంత్ రెడ్డి పరామర్శించారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న మధుసూదన్ రెడ్డి నివాసానికి వెళ్ళిన ఎమ్మెల్యే, ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఆయనకు అందుతున్న వైద్య సేవలు, చికిత్స వివరాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే, వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందేలా చూడాలని సూచించారు. మధుసూదన్ రెడ్డి త్వరలోనే పూర్తి ఆరోగ్యంతో కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకు, నాయకుడికి తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది. ఎలాంటి అవసరమున్నా పార్టీ పరంగా పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ పరామర్శ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు కోడూరు కమలాకర్ రెడ్డి, దువ్వూరు కళ్యాణ్ రెడ్డి, రావిళ్ళ వీరేంద్ర నాయుడు, బెజవాడ వంశీధర్ రెడ్డితో పాటు పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పద్మశ్రీ బాలకృష్ణారెడ్డి సేవలు చిరస్మరణీయం - ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీనివాసులు



కోట, జూలై 15 ప్రభాతవార్త పద్మశ్రీ నేదురుమల్లి బాలకృ ష్ణారెడ్డి బడుగు, బలహీనవర్గాల విద్యార్థులకు అందించిన సేవ లు చిరస్మరణీయమని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టి ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీనివాసులు అన్నారు. బుధవారం జ్యోతిడేను పురస్క రించుకుని కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ విద్యా సంస్థల ప్రాంగణంలో బాలకృష్ణారెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శ్రీనివా సులు మాట్లాడుతూ విద్యాసంస్థలను స్థాపించిన రోజును జ్యోతి డేగా ప్రతి సంవత్సరం జూలై 15న జరుపుకుంటు న్న ట్లు తెలిపారు. పూరిగుడిసెలలో రాత్రి పాఠశాలతో ప్రారంభమై అంచలంచెలుగా ఎదిగి కళాశాలలుగా జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతులు నిలబడ్డాయన్నారు. విద్య అనేది పేదరికాన్ని, అజ్ఞానాన్ని, సామాజిక అసమానతలను తొలగించే మహాజ్యోతి అని పేర్కొన్నారు. విద్య ద్వారానే సమాజంలో శాశ్వత మార్పు సాధ్యమవుతుందన్నారు. నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి చిన్నాన్న బాలకృష్ణారెడ్డి ఆలోచనలకు అనుగుణంగా 1979లో గ్రామీణ ప్రాంతంలో ఇంజినీరింగ్ కళాశాలను జనార్ధన్‌రెడ్డి స్థాపించారన్నారు. ఈ విద్యా సంస్థలను ఆ రోజుల్లోనే భారత రాష్ట్రపతులు, ప్రధానమంత్రులు, గవర్నర్లు, ముఖ్యమంత్రులు, మరెందరో ప్రముఖులు సందర్శించారని ప్రిన్సిపల్ శ్రీనివాసులు గుర్తు చేశారు. ఈ కళాశాలలో చదివిన ఇంజినీరింగ్ విద్యార్థులు ప్రపంచ వ్యాప్తంగా దేశ విదేశాల్లో ప్రముఖ రంగాల్లో ఉన్నారని చెప్పారు. జనార్ధన్‌రెడ్డి కలను ఆయన తనయుడు, కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ముందుకు తీసుకుపోతూ డీమ్డ్ విశ్వవిద్యాలయంగా తీర్చిదిద్దేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో అన్ని విభాగాధిపతులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## దాడి కేసులో నిందితులకు జైలు శిక్ష జరిమానా

**కోవూరు జూలై 15 ప్రభాతవార్త** ఇరువురు దంపతులను పాత కక్షలు మనసులో పెట్టుకొని అమానుషంగా చెట్టుకు కట్టేసి దాడి చేసి గాయపరిచిన కేసులో నిందితులకు జైలు శిక్ష జరిమానా విధిస్తూ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ శివ నమ్రత బుధవారం తీర్పు చెప్పారు ప్రాసిక్యూషన్ కథనం మేరకు బుచ్చి మండలం చెల్లాయి పాలెం గ్రామానికి చెందిన కలిసరి వెంకయ్య పద్మ దంపతు లు17.05.2020.. తేదీన పొలంలో నీళ్ల కట్టేందుకు వెళ్ళగా అదే గ్రామానికి చెందిన తాండ్ర మస్తానయ్య తాండ్ర కుసుమ తాండ్ర అవినాష్ తాండ్ర నరసయ్య తాండ్ర తనుజులు పాత కక్షలు మనసులో పెట్టుకొని చెట్టుకు కట్టేసి దంపతులను గాయపరిచారు ఈ మేరకు బాధితులు అదేరోజు బుచ్చి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు ఈ మేరకు అప్పటి ఎస్సై కేసు నమోదు చేసి నిందితులను కోర్టులో హాజరు పరిచారు కోర్టులో నిందితులపై మోపిన నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి324 సెక్షన్ కింద మూడు సంవత్సరములు జైలు శిక్ష వెయ్యి రూపాయలు జరిమానా.342 సెక్షన్ కింద ఒక సంవత్సరం జైలు శిక్ష వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ రెండు శిక్షలను ఏకకాలంలో అనుభవించాలని తీర్పు చెప్పారు ఒకవేళ జరిమానా కట్టకపోతే మరో నెల జైలుశిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు ప్రాసిక్యూషన్ తరపున ఏపీపి సుకన్య వాదించారు

## ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దిన టీచర్ వరలక్ష్మీ



**బుచ్చి జులై 15 ప్రభాతవార్త** 36 సంవత్సరాలు ఎంతో మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చి దిద్దిన ఉత్తమ ఉపాధ్యాయురాలు కొణిజేటివరలక్ష్మీ అనిబెజవాడ బుజ్జమ్మ జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుజాత ప్రశంసించారు.కొణిజేటి వరలక్ష్మీ స్కూల్ అసిస్టెంట్ బైలాజికల్, స్వచ్ఛంధ పదవివిరమణ సందర్భంగా జరిగిన సభలో ఆమె మాట్లాడుతు బైలాజికల్ టీచర్‌గా వరలక్ష్మీ ఎంతో మంది విద్యార్థులను తీర్చి దిద్దారని అన్నారు. ఆమె క్రమశిక్షణ, విద్యార్థుల చదువు పట్ల అంకిత భావం ఆదర్శనీయమని కొనియాడారు. అనంతరం స్వచ్ఛంధంగా పదవి విరమణ చేసిన కొణిజేటి వరలక్ష్మీ మాట్లాడారు.కొన్ని కారణాల వల్ల తాను స్వచ్ఛంధ పదవివిరమణ చేస్తున్నట్లు తెలిపారు. ఇంత మంది ఉపాధ్యాయులు, విద్యార్థులను విడిచిపోతుంటే చాలా బాధంగా ఉందని ఆమె ఒకింత ఉద్వేగానికి గురైయ్యారు. కుటుంబంలో మాభర్త బచ్చు వెంకట సత్య నరసింహరావు గుంపర్లపాడు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, కుమారుడు ,కోడలు, అల్లుడు,కోడలు అందరు తనకు అన్ని విధాలా సహకారం అందిస్తారని ఆమె పేర్కున్నారు. అలాగే విధినిర్వహణలో తనకు పూర్తి స్దాయిలో సహకారం అందించిన ఉపాధ్యాయులకు కూడా ఆమె ప్రత్యేకంగా దన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు వరలక్ష్మీ దంపతులను శాలులవాలు కప్పి కీరిటాలు పెట్టి ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.ఈకార్యక్రమంలో కుమారుడు సంగం మండలం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఇ రవితేజా, భారతి, అల్లుడు పువ్వాడి పవన్‌కుమార్, పద్మపావని, పాఠశాల ఉపాధ్యాయులు, యుటిఎఫ్‌నాయకులు, విద్యార్థులు పాల్గోన్నారు.

## ఈఏపీసెట్ అడ్మిషన్ల కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల



**కోట,జులై 15 ప్రభాతవార్త** ఏపీ ఎప్‌సెట్ ఫలితాలు వెల్లడి కావడంతో కౌన్సెలింగ్ ప్రక్రియ పైవిద్యా శాఖ అధికారులు దృష్టిసారించారు. ఈ మేరకు తొలి విడత ప్రవేశాలకు కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను బుధవారం విడుదలచేశారు. జులై 20నుంచి 29 వరకు పది రోజుల పాటు రిజిస్ట్రేషన్,ఫీజు చెల్లింపు ప్రక్రియ కొనసా గనుంది. విద్యార్థుల సర్టిఫికేషన్ ప్రక్రియ జులై 22 నుంచి 31 వరకు చేపట్టనున్నారు. జులై 25 నుంచి 31వ తేదీ వరకు వెబ్ ఆప్షన్ల నమోదుకు అవకాశం కల్పించనట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఆగస్టు 1న వెబ్ ఆప్షన్లు మూర్చుకొనేందుకు అవకాశం ఇస్తున్నారు. ఆగస్టు 6న తొలి విడత సీట్ల కేటాయంపు ప్రక్రియ పూర్తి చేసి ఆగస్టు 7 నుంచి 13వ తేదీ వరకు కాలేజీలో సెల్ఫ్ జాయినింగ్ ,రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. ఆగస్టు 10 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని విద్యాశాఖ అధికారులు తెలిపారు.జిల్లాలో 12 ఇంజి నీరింగ్ కళాశాలు ఉన్నాయి. 8,722 సీట్లు అదుబాటలు ఉన్నాయి. ఈఏపీ సెట్ రాసిన వారు 14,800 మంది అర్హత సాధించిన వారు 12,639 మంది. వీరందరు ఎదురు చూస్తున్న కౌన్సెలింగ్ తేదీలను ప్రభుత్వం ప్రకటిచింది.

## కేంద్ర పథకాల అమలుపై ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సమీక్ష

- జిల్లాలో మెగా లోన్ మేళా నిర్వహణపై సుదీర్ఘ చర్చ



**నెల్లూరు, జూలై 15, ప్రభాతవార్త – వైద్యం** నెల్లూరు జిల్లాలో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు, వాటి కింద మంజూరు చేస్తున్న రుణాల పురోగతిపై నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని బుధవారం నాబార్డ్ డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ మేనేజర్ (డి.డి.ఎం) డాక్టర్ బాబు, లీడ్ బ్యాంక్ డిస్ట్రిక్ట్ మేనేజర్ (ఎల్.డి.ఎం) మణిశేఖర్ కలిశారు. జిల్లాలో ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వ వివిధ పథకాల కింద లబ్ధిదారులకు మంజూరు చేసిన రుణాలు, పథకాల అమలు తీరును ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ కేంద్ర ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా చూడాలని, ముఖ్యంగా గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, స్వయం ఉపాధి రంగాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీ అధికారులకు సూచించారు. రుణాల మంజూరు ప్రక్రియను మరింత వేగవంతం చేసి, ఎక్కువ మందికి లబ్ధి చేకూర్చేందుకు వీలుగా జిల్లాలో ఒక మెగా లోన్ మేళా నిర్వహించాలని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అధికారులకు సూచించారు. ఎంపీ ఈ మెగా లోన్ మేళా నిర్వహణకు సంబంధించిన కార్యాచరణ, ప్రణాళికలపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు.

## స్వచ్ఛ గ్రామాలకు ప్రజలు సహకరించాలి



**కోవూరు, జూలై 15 ప్రభాతవార్త :** గ్రామాలు పూర్తిగా స్వచ్ఛ గ్రామాలుగా మారేందుకు ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించాలని ఎంపీడీవో శ్రీహరిరెడ్డి అన్నారు. కోవూరు మండలం పడుగుపాడు పంచాయతీలో జరుగుతున్న పారిశుధ్య పనులను బుధవారం ఆయన స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు చెత్తాచెదారాలను ఎక్కడంటే అక్కడ పడవేయకుండా పంచాయతీ ఏర్పాటు చేసిన చెత్త కుండీలను ఉప యోగించుకోవాలన్నారు. అదేవిధంగా ఇంటికి వచ్చే గ్రీన్ అంబాసిడర్లకు చెత్తను తడి చెత్త పొడి చెత్త రూపంలో వేరువేరుగా అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సలీమ్, తదితరులు ఉన్నారు.

## బూత్ కన్వీనర్‌ను అభినందించిన ఎమ్మెల్యే



**కోవూరు, జూలై 15 ప్రభాతవార్త :** కోవూరు నియోజకవర్గం సంబంధించి ఎస్ఐఆర్ ఓటరు వెరిఫి కేషన్‌ను నూరుశాతం పూర్తిచేసిన 135వ బూత్ కన్వీనర్ నాటకరాణి వెంకట్‌ను కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి బుధవారం జరిగిన సమావేశంలో పుష్ప గుచ్ఛంతో సన్మానించారు. పార్టీ అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించి ఓటరు వెరిఫికేషన్‌ప్రక్రియను విజయవంతంగా పూర్తిచేయడం అభినందనీయమన్నారు. ఇదేస్ఫూర్తితో పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషిచేయాలని ఎమ్మెల్యేపిలుపుని చ్చారు.ఎమ్మెల్యేచే అభినందనలు అందుకున్న వెంకట్‌ను సహచర మిత్రులు,నాయకులు కూడా అభినందించారు.

## వీపీఆర్ ఫౌండేషన్ సేవలు నిరుపమానం





**కోవూరు, జూలై 15 ప్రభాతవార్త :** వీపీఆర్ ఫౌండేషన్ అధినేతలు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిలు ప్రజల కోసం చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు నిరుపమానం అని పట్టణ పార్టీ అధ్యక్షుడు ఇంతా మల్లారెడ్డి తెలిపారు. కోవూరు పంచాయతీ ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన వీపీఆర్ నేత్ర కంటి పరీక్షల కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు రాకమునుపే వీపీఆర్ దంపతులు సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టారన్నారు. ప్రస్తుతం గతంలో ఎన్నడూ లేని విధంగా వీపీఆర్ నేత్ర పథకాన్ని ప్రవేశపెట్టి పేద ప్రజలకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వ హించడమే కాకుండా అవసరమైన వారికి కంటి అద్దాలు కూడా ఉచితంగా పంపిణీ చేస్తున్నారన్నారు. ఇటువంటి సామాజిక సేవా కార్యక్రమాలు చేపడు తున్న వీపీఆర్ దంపతులు జిల్లాకు దొరకడం ప్రజలు చేసుకున్న అదృష్టమన్నారు. ఇందుకు వేమిరెడ్డి దంప తులకు కోవూరు ప్రజల తరపున ప్రత్యేక కృజజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఈ సందర్భంగా కంటి పరీక్షలు నిర్వహించుకున్న వారికి అద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు ఎం. సుధాకర్, సాయిరెడ్డి, చెన్నకృష్ణారెడ్డి, విజయ్‌కుమార్, మదన్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

## ఉమా మహేశ్వరి సేవలు అభినందనీయం



**నెల్లూరు, జూలై 15, ప్రభాతవార్త –విద్య** జిల్లా వైద్యశాఖలో నిబద్ధతతో పనిచేసి పదోన్నతి పొందిన డాక్టర్ ఏ.ఉమా మహేశ్వరి సేవలు అభినందనీయమని ఏపీ హంస జిల్లా అధ్యక్షులు చేజర్ల సుధాకర్‌రావు పేర్కొన్నారు. బుధవారం పదోన్నతి పొందిన ఉమామహేశ్వరిని హంస నాయకులు పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా చేజర్ల మాట్లాడుతు జిల్లా వైద్యశాఖలో ఇమ్యునైజేషన్ అధికారిగా విధులు నిర్వహిస్తూ నేడు ఎన్టీఆర్ ఆరోగ్యసేవ రాష్ట్ర విభాగం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా పదోన్నతిపై ఉమామహేశ్వరి వెల్లటం గర్వకారణమన్నారు. అనేక ప్రాథమిక కేంద్రాల్లో, మెడికల్ అధికారిణిగా, డివిజన్ కేంద్రాల్లో డిప్యూటీ డిఎంహెచ్‌ఓగా , అనేక సంవత్సరాల పాటూ ఇమ్యునైజేషన్ అధికారిణిగా ఆమే చేసిన సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. కరోనా సమయంలో ఆమే విధి నిర్వహణలో చూపిన స్ఫూర్తి ఎప్పటికి మరువలేమన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని ఉన్నత పదవులు పొందాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో డెమె కనకరత్నం, హంసనాయకులు మజార్, మురళీకృష్ణ, నాగరాజు, మార్గరెట్, తిరుపతయ్య, సుకన్య, కల్పన, వెంకటేష్, శేషయ్య, తదితరులు పాల్గొన్నారు.